VASANTH KUMAR
Director
QUALITY SERVICE SINCE 1997
Victoria Consultants
Overseas Educational Services
(Australia, Canada, U.K. U.S.A., New Zealand)
EDUCATION IN AUSTRALIA
AAERI MEMBER
QEAC No. E334
: 1-10-3, Ashok Nagar, Hyderabad-20, INDIA
:91(40) 27628134, 27674037
:victoria.ashoknagar@gmail.com
://www.victoriaoverseas.com

PRAJA PRASHNA
# ప్రజాప్రశ్న
RNI : TELTEL/2021/80267
తెలుగు దినపత్రిక


- Host On Your Domain
- Hosting / Admin Panel
- Page Builder / Social Links
- Responsive Design
- Advertisement Spaces
- Search Engine Optimization
- XML Sitemap
- Automatic Software Updates
Publish Your Newspaper/Website Online
Contact Us : 9666136456

సంపుటి: 5 సంచిక: 40, పేజీలు - 08
సోమవారం, జులై 14, 2025 వెల: 5 రూ/.
హైదరాబాద్ | ప్రజల పక్షాన ప్రశ్నించే పత్రిక | HYDERABAD

## పైలెట్లను బాధ్యుల్ని చేయడం తగదు

**- ఖండించిన భారత పైలట్ల సంఘం**



న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్) అహ్మదాబాద్‌లో జరిగిన ఎయిర్ ఇండియా విమాన ప్రమాదంపై భారత పైలట్ల సంఘం తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది.

2లో..

## బీహార్ లో బంగ్లాదేశీయులకూ ఓటు హక్కు

**- ఈసీ సవరణ సర్వేలో బయటపడుతున్న అక్రమాలు**



పాట్నా (ప్రశ్న న్యూస్) అసెంబ్లీ ఎన్నికల సంసిద్ధత కోసం బీహార్ లో ఎలక్షన్ కమిషన్ (ఈసీ) చేపట్టిన ఓటర్ జాబితా సవరణ సర్వేలో పలు షాకింగ్ విషయాలు బయటపడుతున్నాయి. బీహార్ లో

2లో..

## మా అణ్వాయుధ కార్యక్రమం శాంతియుత ప్రయోజనాల కోసమే

**- పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్**



ఇస్లామాబాద్ (ప్రశ్న న్యూస్) భారత్ ఇటీవల చేపట్టిన 'ఆపరేషన్ సిందూర్' సమయంలో అణు ఉద్రిక్తతలు ఏర్పడ్డాయని, పాకిస్థాన్ అణుదాడికి సిద్ధమైందని వచ్చిన కథనాలను ఆ దేశ ప్రధానమంత్రి

2లో..

# ఘనంగా ఉజ్జయిని మహంకాళి బోనాలు

## పట్టు వస్త్రాలు సమర్పించిన సీఎం రేవంత్ రెడ్డి



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) సికింద్రాబాద్ ఉజ్జయిని మహంకాళి బోనాల జాతర ఆదివారం ఘనంగా ప్రారంభమైంది. డప్పు చప్పుళ్లు, పోతురాజుల వీరంగాలు, ఘటాల ఊరేగింపుతో జాతర ప్రారంభమైంది.

మహంకాళి అమ్మవారికి తెల్లవారుజామునే మహామంగళ హారతి ఇచ్చి జాతరను ప్రారంభించారు. లష్కర్ బోనాలు అని పిలవబడే ఉజ్జయిని బోనాల జాతర రెండు రోజుల పాటు జరగనుంది. జాతర సందర్భంగా మహంకాళి అమ్మవారిని దర్శించుకునేందుకు ఉదయం నుంచే భక్తులు భారీగా తరలివస్తున్నారు.

### పట్టువస్త్రాలు సమర్పించిన సీఎం రేవంత్

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సికింద్రాబాద్‌లోని ఉజ్జయిన మహంకాళి బోనాల జాతరకు హాజరయ్యారు. అమ్మవారికి సీఎం రేవంత్ ప్రభుత్వం తరఫున పట్టువస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. సీఎం రేవంత్ రెడ్డికి ఆలయ అధికారులు పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. అనంతరం అర్చకులు ముఖ్యమంత్రికి వేదాశీర్వచనాలు ఇచ్చారు. అమ్మవారికి మంత్రి కొండా సురేఖ బోనం సమర్పించుకున్నారు. రాష్ట్రంలో ప్రజలందరికీ మంచి జరగాలని అమ్మవారిని సీఎం రేవంత్ రెడ్డి ప్రార్థించారు. సీఎం రేవంత్‌తో పాటు మంత్రులు పొన్నం ప్రభాకర్, పొంగులేటి



శ్రీనివాస్ రెడ్డి, అడ్లూరి లక్ష్మణ్, సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ఎంపీ అనిల్ కుమార్ యాదవ్, ఎమ్మెల్యేలు, తదితరులు అమ్మవారిని దర్శించుకున్నారు.

### లష్కర్ బోనాలకు భారీ బందోబస్తు

ఆదివారం లష్కర్ బోనాలతో పాటు ఫలహార బండ్ల ఊరేగింపు నిర్వహిస్తారు. 14న రంగం, పోతరాజుల గావు, అంబారీపై అమ్మవారి ఊరేగింపు నిర్వహించనున్నారు. సికింద్రాబాద్ ఉజ్జయిని మహంకాళి ఆలయం వద్ద భక్తులకు ఇబ్బందులు లేకుండా 6 క్యూలైన్లను ఏర్పాటు చేశారు. 2500 మంది పోలీసులతో జాతర కోసం భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. లష్కర్ బోనాల సందర్భంగా ఆదివారం, సోమవారం హైదరాబాద్ లో వైన్ షాపులు బంద్ చేశారు. జాతర నేపథ్యంలో పలు చోట్ల ట్రాఫిక్ ఆంక్షలు విధించారు.

### కులీకుతుబ్‌షా కాలం నుంచే బోనాల వేడుకలు

ఆషాడమాసంలో రోజుల పాటు హైదరాబాద్ అంతటా బోనాల వేడుకలు వైభవంగా జరుగుతాయి. గోల్కొంట కోటలో బోనాలు ప్రారంభమై లాల్ దర్వాజతో ముగుస్తాయి. ఆషాడ మాస బోనాల్లో గోల్కొండ కోటపైన ఉన్న జగదాంబిక అమ్మవారికి తొలి బోనం ఎ మర్పించే సంప్రదాయం కులీకుతుబ్‌షా కాలం నుంచి వస్తుంది. రాష్ట్ర ప్రభుత్వం అధికారిక పండుగగా బోనాల ఉత్సవాలను నిర్వహిస్తోంది. జంటనగరాల్లోబోనాల కోసం రూ. 20 కోట్లు రిలీజ్ చేసింది.

### ప్రత్యేక ఆకర్షణగా రంగం

నేడు జరిగే 'రంగం' కార్యక్రమం ఈ జాతరలో ప్రధాన ఆకర్షణ. ఈ సందర్భంగా భవిష్యవాణి వినిపించడం సంప్రదాయం. రంగంలో మట్టికుండపై భవిష్యవాణి వినిపిస్తారు. అదే రోజు అమ్మవారి అంబారీ ఊరేగింపు, ఫలహార బండ్ల ఊరేగింపు జరగనున్నాయి. జులై 20 ఓల్డ్ సిటీ లాల్ దర్వాజ సింహవాహిని అమ్మవారికి బోనాలు సమర్పిస్తారు భక్తులు. జులై 23న చార్మినార్ భాగ్యలక్ష్మి అమ్మవారికి బోనాలు సమర్పించనున్నారు.

## రాజ్యసభకు నలుగురు నామినేట్

**- కసబ్ కేసు వాదించిన లాయర్ కూడా**



**న్యూఢిల్లీ (ప్రశ్న న్యూస్)** వివిధ రంగాల్లో విశేష సేవలు అందించిన నలుగురు ప్రముఖులను భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము రాజ్యసభకు నామినేట్ చేశారు. ప్రముఖ న్యాయవాది ఉజ్వల్ నికమ్, మాజీ విదేశాంగ కార్యదర్శి హర్ష్ శ్రింగ్లా, కేరళ ఉపాధ్యాయుడు, సామాజిక కార్యకర్త సి. సదానందన్ మాస్టర్, ప్రఖ్యాత చరిత్రకారిణి మీనాక్షి జైన్‌లు పార్లమెంటు ఎగువ సభకు నామినేట్ అయిన వారిలో ఉన్నారు. ఈ నామినేషన్లు దేశానికి వారు చేసిన సేవలకు దక్కిన గుర్తింపుగా

2లో..

## అమరావతిలో పింఛన్ పునరుద్ధరణ

**- ఏపీ ప్రభుత్వం కీలక ఆదేశాలు**



అమరావతి (ప్రశ్న న్యూస్) రాష్ట్ర రాజధాని అమరావతి ప్రాంతంలోని భూమిలేని నిరుపేదలకు ఏపీ ప్రభుత్వం శుభవార్త చెప్పింది. గతంలో వారికి ఇచ్చే పెన్షన్ ను పునరుద్ధరిస్తూ కూటమి ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. రాజధాని అమరావతి నిర్మిస్తున్న గ్రామాల్లోని 1575 కుటుంబాలకు పింఛన్ మంజూరు చేస్తూ కూటమి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. వైఎస్ జగన్ హయాంలో గత వైసిపి ప్రభుత్వం ఈ పింఛన్లను రద్దు చేయడం తెలిసిందే. 2015లో జరిగిన ఇంటింటి సర్వే ఆధారంగా 1575 నిరుపేద కుటుంబాలను అప్పటి చంద్రబాబు ప్రభుత్వం అర్హులుగా గుర్తించింది. ఇటీవల జరిగిన ఏపీ కేబినెట్ భేటీలో రాజధాని ప్రాంతంలోని

2లో..

# తీన్మార్ మల్లన్న ఆఫీసుపై దాడి

**- గాల్లోకి కాల్పులు జరిపిన గన్‌మెన్**



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న కార్యాలయంపై ఆదివారం నాడు దాడి జరిగింది. బీఆర్ఎస్ ఎమ్మెల్సీ, తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవితపై అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ మేడిపల్లిలోని తీన్మార్ మల్లన్న ఆఫీసుపై దాడికి పాల్పడినారు. గత కొన్ని రోజుల నుంచి కవిత బీసీ ఉద్యమానికి, బీసీ రిజర్వేషన్లపై ఉద్యమిస్తున్నారు. అన్ని రాజకీయ పార్టీల నేతలను, బీసీ సంఘాలను కలిసి 42 శాతం రిజర్వేషన్ల కోసం మద్దతు కూడగడుతున్నారు. ఈ క్రమంలో ఎమ్మెల్సీ కవిత చేస్తున్న బీసీ ఉద్యమం అంతా నాటకమేనని తీన్మార్ మల్లన్న తప్పుపట్టారు. మరింత హద్దు దాటి కవితపై వ్యక్తిగతంగా సైతం తీన్మార్ మల్లన్న తీవ్ర వ్యాఖ్యలు చేశారని జాగృతి సభ్యులు, ఆమె అభిమానులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

2లో..

## అమరావతిలో సింగపూర్

**- సింగపూర్‌కు చంద్రబాబు టీం**



**అమరావతి (ప్రశ్న న్యూస్)** ముఖ్యమంత్రి చంద్రబాబు సింగపూర్ పర్యటనకు వెళ్లనున్నారు. ఈ నెల 15,16 తేదీల్లో సీఎం చంద్రబాబు ఢిల్లీలో కీలక సమావేశాల్లో పాల్గొంటున్నారు. కేంద్ర మంత్రులను కలవనున్నారు. ఈ పర్యటన లో బనకచర్ల ప్రాజెక్టు పైన కేంద్రంతో చర్చిస్తారు. ఇక, సుదీర్ఘ కాలం తరవాత మరోసారి చంద్రబాబు సింగపూర్ బాట పడుతున్నారు. మంత్రులు అధికారులతో కలిసి

2లో..

## వదిలిపెట్టేది లేదు..

# తీన్మార్ మల్లన్న జాగ్రత్త

**- కవిత స్ట్రాంగ్ వార్నింగ్**



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) తనపై అసభ్య పదజాలం వాడిన ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న సభ్యత్వాన్ని రద్దు చేయాలని, చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత శాసనమండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డికి ఫిర్యాదు చేశారు. జూబ్లీహిల్స్ లోని గుత్తా సుఖేందర్ రెడ్డి నివాసానికి వెళ్లి ఫిర్యాదు లేఖ ఇచ్చారు కవిత. ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న అలియాస్ చింతపండు నవీన్ తన వ్యక్తిత్వాన్ని దెబ్బతీసేలా, కించపరిచేలా చేసిన వ్యాఖ్యలపై "కమిటీ

2లో..

## నా మీద హత్యాయత్నం చేస్తారా..

# ఇక నుంచి తేల్చుకుందాం

**- కవితపై తీన్మార్ మల్లన్న ఫైర్ - కవిత ఎమ్మెల్సీ సభ్యత్వాన్ని రద్దు చేయాలంటూ డిమాండ్**

**- మూడేళ్లలో మిమ్మల్ని రాజకీయంగా పాతాళానికి తొక్కేస్తానంటూ హెచ్చరిక**




**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** కేసీఆర్, కేటీఆర్ మీద ఏమైనా ఫ్రస్ట్రేషన్ ఉంటే వారితో తేల్చుకోవాలి, కానీ తనపై హత్యాయత్నం చేయడం ఏంటని ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎమ్మెల్సీ కవిత, ఆమెకు సంబంధించిన తెలంగాణ జాగృతి కార్యకర్తలు తనపై హత్యాయత్నం చేశారని చింతపండు నవీన్ ఆరోపించారు. తన ఆఫీసులో దాడి తరువాత తీన్మార్ మల్లన్న మీడియాతో మాట్లాడుతూ 'నాపై దాడులు చేస్తే బీసీ ఉద్యమం ఆగిపోతుంది అనుకుంటే అది మీ భ్రమే. నాపై హత్యాయత్నాలతో బీసీ ఉద్యమాన్ని ఆపలేరు. ఇలాంటి దాడులకు తీన్మార్ మల్లన్న

2లో..

## మేటి నటుడికి కడసారి వీడ్కోలు

**- జూబ్లీహిల్స్ మహాప్రస్థానంలో ముగిసిన కోట అంత్యక్రియలు**

2లో..



## ప్రజల కోసమే ప్రతి రూపాయి ఖర్చు

**- విద్య, వైద్య రంగాల అభివృద్ధికి పెద్దపీట**



హైదరాబాద్ (ప్రశ్న న్యూస్) రాష్ట్రంలోని ప్రజల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తుందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. ఆదివారం మంచిర్యాల జిల్లాలోని లక్షెట్టిపేట మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన 30 పడకల సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని రాష్ట్ర ఆరోగ్య, వైద్య, కుటుంబ సంక్షేమ, శాస్త్ర సాంకేతిక శాఖ మంత్రి దామోదర రాజనరసింహ, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి

2లో..

## డ్రగ్స్‌పై ఈగల్ టీమ్ పంజా

**- వాట్సాప్ కోడ్‌తో డెకాయ్ ఆపరేషన్**

EAGLE
Elite Action Group
For Drug Law Enforcement

**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** హైదరాబాద్‌లో గంజాయి వినియోగంపై ఈగల్ టీమ్ ఉక్కుపాదం మోపుతుంది. తాజాగా హైదరాబాద్ ఐటీ కారిడార్ నిర్వహించిన డెకాయ్

3లో..

# పైలెట్లను బాధ్యుల్ని చేయడం తగదు

ఈ ఘటనలో పైలట్లదే తప్పు అనే విధంగా వచ్చిన ప్రాథమిక నివేదికను ఎయిర్‌లైన్ పైలట్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (ఏఎల్పీఏ) తప్పుబట్టింది. ఈ నివేదికలో పైలట్ తప్పిదం వల్లే ప్రమాదం జరిగిందని సూచించడం పట్ల సంఘం అసంతృప్తి వ్యక్తం చేసింది. ఈ ప్రమాదంలో 241 మంది ప్రయాణికులు, సిబ్బంది మరణించగా, ఒక్కరు మాత్రమే బయటపడ్డారు. జూన్ 12న అహ్మదాబాద్‌లోని సర్దార్ వల్లభాయ్ పటేల్ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి లండన్ గాట్విక్‌కు బయలుదేరిన ఎయిర్ ఇండియా ఫ్లైట్ 171, టేకాఫ్ అయిన కొద్ది సెకన్లలోనే కుప్పకూలింది. భారత విమాన ప్రమాద దర్యాప్తు సంస్థ (ఏఏఐబీ) విడుదల చేసిన ప్రాథమిక నివేదిక ప్రకారం, టేకాఫ్ సమయంలో ఇంజన్లకు ఇంధన సరఫరా నిలిపివేయబడిందని గుర్తించారు. ఆ సమయంలో ఒక పైలట్ మరొకరిని "ఎందుకు ఇంధనాన్ని కట్ చేశావు?" అని ప్రశ్నించగా, నేను ఆఫ్ చేయలేదని మరో పైలట్ జవాబిచ్చినట్టు కాక్‌పిట్ వాయిస్ రికార్డర్‌లో రికార్డైందని నివేదిక తెలిపింది.అయితే, ఏఎల్పీఏ ఈ నివేదికను విమర్శిస్తూ, దర్యాప్తు పక్షపాతంతో కూడుకున్నదని, పారదర్శకత లోపించిందని ఆరోపించింది. దర్యాప్తు ప్రక్రియలో పైలట్లను కనీసం పరిశీలకులుగా చేర్చాలని డిమాండ్ చేసింది. ఈ ఘటనకు సంబంధించి మీడియాలో వస్తున్నవి అసంబద్ధ ఊహాగానాలు అంటూ సంఘం ఖండించింది. కేంద్ర విమానయాన శాఖ మంత్రి రామ్ మోహన్ నాయుడు కూడా, ఈ నివేదిక ప్రాథమికమైనదని, తుది నివేదిక వచ్చే వరకు ఎవరినీ నిందించవద్దని సూచించారు. నిపుణుల అభిప్రాయం ప్రకారం, బోయింగ్ 787-8 విమానంలో ఉన్న ఇంధన స్విచ్‌లు జాగ్రత్తగా రూపొందించబడ్డాయి. వాటిని అనుకోకుండా మార్చడం కష్టం. అయినప్పటికీ, ఈ స్విచ్‌లు ఎందుకు కట్‌ఆఫ్ స్థితికి మారాయనే దానిపై దర్యాప్తు కొనసాగుతోంది. పైలట్ల సంఘాలు ఈ ఘటనలో సాంకేతిక లోపాలు లేదా ఇతర కారణాలను కూడా పరిశీలించాలని కోరుతున్నాయి.

# బీహార్‌లో బంగ్లాదేశీయులకూ ఓటు హక్కు

అక్రమంగా నివాసం ఉంటున్న పలువురు బంగ్లాదేశ్, నేపాల్, మయన్మార్ పౌరులు కూడా ఓటు హక్కు పొందారని తేలింది. ఓటర్ జాబితాలో వారి పేర్లు ఉన్నాయని ఈసీ అధికారులు చెబుతున్నారు. ఆగస్టు 1 నుంచి ఇలాంటి అనర్హుల పేర్లను ఓటర్ జాబితాలో నుంచి తొలగిస్తామని పేర్కొన్నారు. ఎలక్షన్ కమిషన్ చేపట్టిన ఈ సర్వేపై ప్రతిపక్షాలు ఆందోళన వ్యక్తం చేశాయి. కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వం అధికార దుర్వినియోగానికి పాల్పడుతోందని, ఈసీ బీజేపీకి అనుకూలంగా వ్యవహరిస్తోందని విమర్శించాయి. అనర్హుల పేరుతో ప్రతిపక్షాల ఓటు బ్యాంకును ఓటర్ జాబితా నుంచి తొలగించేందుకే ఈ సర్వే చేపట్టిందని ఆరోపించాయి. ఈ విషయంపై అసోసియేషన్ ఆఫ్ డెమోక్రటిక్ రిఫార్మ్స్ (ఏడీఆర్) అనే స్వచ్ఛంద సంస్థ సుప్రీం కోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. అయితే ఈసీ చేపట్టిన సర్వే రాజ్యాంగబద్ధమేనని స్పష్టం చేసిన సుప్రీంకోర్టు.. ఎన్నికల ముందు సర్వే చేయడంపై ఈసీని ప్రశ్నించింది.

# మా అణ్వాయుధ కార్యక్రమం శాంతియుత ప్రయోజనాల కోసమే

షెహబాజ్ షరీఫ్ తోసిపుచ్చారు. పాకిస్థాన్ అణ్వాయుధ కార్యక్రమం శాంతియుత ప్రయోజనాల కోసం, ఆత్మరక్షణ కోసమే తప్ప, ఇతరులపై దాడుల కోసం కాదని ఆయన స్పష్టం చేశారు. భారత్, పాకిస్థాన్ మధ్య ఉద్రిక్తతలు పెరుగుతున్న నేపథ్యంలో ఈ ప్రకటన ప్రాధాన్యతను సంతరించుకుంది. గతంలో పాకిస్థాన్ నుంచి "అణు బ్లాక్‌మెయిల్" కుట్రలు జరిగాయని ఆరోపణలు రావడంతో, భారత్ వాటిని ద్వైపాక్షికంగా ఎదుర్కొంటామని శపథం చేసింది. ఆపరేషన్ సిందూర్ సమయంలోనే, భారత్ సింధు నదీ జలాల ఒప్పందాన్ని తాత్కాలికంగా నిలిపివేయడంతో ఉద్రిక్తతలు మరింత పెరిగాయి. దీనికి ప్రతిస్పందనగా, పాకిస్తాన్ తమ "సంపూర్ణ బలంతో" ప్రతీకారం తీర్చుకుంటామని హెచ్చరించింది. ఈ ప్రకటన అణు బెదిరింపుగానే భావించాల్సి ఉంటుందని విస్తృతంగా ప్రచారం జరిగింది. ఏప్రిల్ 22న పహల్గామ్ దాడికి ప్రతీకారంగా మే 7న భారత్ 'ఆపరేషన్ సిందూర్'ను ప్రారంభించింది. ఈ ఆపరేషన్‌లో పాకిస్థాన్, పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీర్‌లోని ఉగ్రవాద స్థావరాలను లక్ష్యంగా చేసుకుని సైనిక చర్యలు చేపట్టారు. ఈ నేపథ్యంలోనే షెహబాజ్ షరీఫ్ అణ్వాయుధాల గురించి చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశమయ్యాయి. పాకిస్థాన్ యొక్క అణ్వాయుధ సామర్థ్యం దేశ భద్రతకు కట్టుబడి ఉందని, కానీ అది దౌర్జన్యం చేసేందుకు ఉద్దేశించినది కాదని ఆయన పునరుద్ఘాటించారు. ఈ ప్రాంతంలో శాంతి, స్థిరత్వాన్ని కాపాడటమే పాకిస్థాన్ లక్ష్యమని ఆయన పేర్కొన్నారు.

# రాజ్యసభకు నలుగురు నామినేట్

భావిస్తున్నారు.

### న్యాయరంగంలో ఉజ్వల్ నికమ్ సేవలు..

ఉజ్వల్ నికమ్ పేరు దేశ వ్యాప్తంగా సుపరిచితం. పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా ఆయన ఎన్నో సంచలనాత్మక కేసులను సమర్థవంతంగా వాదించారు. ముఖ్యంగా 2008 ముంబై 26/11 ఉగ్రదాడుల కేసు, 1993 ముంబై బాంబు పేలుళ్ల కేసు వంటి అత్యంత కీలకమైన ఉగ్రవాద కేసులను ఆయన వాదించి దోషులకు శిక్షలు పడేలా చేయడంలో కీలక పాత్ర పోషించారు. న్యాయ వ్యవస్థ పట్ల ఆయనకున్న నిబద్ధత, నిశితమైన వాదన సామర్థ్యం దేశానికి ఎంతో ప్రఖ్యాతిని తెచ్చాయి. ఉగ్రవాదంపై పోరాటంలో ఆయన చేసిన కృషి అపారమైనది.

### దౌత్యరంగంలో హర్ష్ శ్రింగ్లాఅనుభవం..

హర్ష్ శ్రింగ్లా భారత మాజీ విదేశాంగ కార్యదర్శిగా సుదీర్ఘ కాలం సేవలు అందించారు. అనుభవజ్ఞుడైన దౌత్యవేత్తగా, అంతర్జాతీయ సంబంధాలు, విదేశాంగ విధానంలో ఆయనకు విస్తృతమైన అనుభవం ఉంది. విదేశాంగ కార్యదర్శిగా ఆయన పదవీ కాలంలో అనేక ముఖ్యమైన దౌత్యపరమైన సంప్రదింపులలో పాలుపంచుకున్నారు. అంతర్జాతీయ వేదికలపై భారతదేశ స్థానాన్ని పటిష్టం చేయడంలో ఆయన కృషి గణనీయమైనది. ఆయన దౌత్య అనుభవం రాజ్యసభకు అమూల్యమైన ఆస్తిగా నిలవబోతుంది.

### చరిత్ర రంగంలో మీనాక్షి జైన్ కృషి..

ప్రముఖ చరిత్రకారిణి, రచయిత్రి మీనాక్షి జైన్ భారత చరిత్రకు చేసిన కృషికి ప్రసిద్ధి చెందారు. భారతీయ సంస్కృతి, సామాజిక అంశాలపై ఆమె చేసిన లోతైన పరిశోధనలు, రచనలు విద్యా రంగంలో ఆమెకు విశేష గౌరవాన్ని తెచ్చాయి. ఆమె రచించిన అనేక పుస్తకాలు చారిత్రక పరిజ్ఞానాన్ని పెంపొందించడంలో, భారతీయ వారసత్వాన్ని అర్థం చేసుకోవడంలో దోహదపడ్డాయి. ఆమె జ్ఞానం, పరిశోధనా నైపుణ్యం రాజ్యసభ చర్చలకు విలువను చేకూర్చనున్నాయి.

### సామాజిక కార్యకర్తగా సి. సదానందన్ మాస్టర్ సేవలు..

కేరళకు చెందిన సి. సదానందన్ మాస్టర్ ఉపాధ్యాయుడిగా సేవలు అందించారు. అలాగే సామాజిక కార్యకర్తగా, బీజేపీ నేతగా కూడా కొనసాగుతున్నారు. 1994లో సీపీఎం నేతల దాడిలో ఆయన రెండు కాళ్లు కోల్పోగా ఈ ఘటన అప్పట్లో రాజకీయంగా తీవ్ర దుమారం రేపింది. 2021 కేరళ అసెంబ్లీ ఎన్నికల్లో ఆయన బీజేపీ తరఫున పోటీ కూడా చేశారు. ఈ నలుగురి నామినేషన్లతో కళలు, సైన్స్, సాహిత్యం, సామాజిక సేవ వంటి వివిధ రంగాల నుండి రాజ్యసభకు నిపుణులైన వ్యక్తులను నామినేట్ చేసే సంప్రదాయం కొనసాగింది. ఈ నియామకాలు పార్లమెంటు ఎగువ సభకు వైవిధ్యమైన నైపుణ్యాన్ని, అనుభవాన్ని తీసుకు వస్తాయని అంతా ఆశిస్తున్నారు.

# నా మీద హత్యాయత్నం చేస్తారా.. ఇక నుంచి తేల్చుకుందాం

భయపడుతాడు అనుకుంటే అది మీ భ్రమే. కవిత అనుచరుల దాడిలో నా చేతికి గాయమైంది. దాడులను గమనించిన మా గన్‌మెన్ అప్రమత్తం అయ్యారు. కానీ ఆ గూండాలు గన్ మెన్ వద్ద నున్న తుపాకీ లాక్కొని మరీ మా ఆఫీసులో బీభత్సం చేశారు. మా సిబ్బందిపై దాడి చేయడంతో పాటు ఫర్నీచర్, ఆఫీసులో అద్దాలు ధ్వంసం చేసి హత్యాయత్నం చేశారు. ఈ దాడుల్లో నాతో పాటు కొందరు సిబ్బందికి గాయాలు అయ్యాయి. బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత, ఆమె కుటుంబం నాపై హత్యాయత్నం చేసింది. బీసీలను అధికారంలోకి తెచ్చేందుకు నా ప్రయత్నం ఆగదు. నేను ఎట్టిపరిస్థితుల్లోనూ వెనుకడుకు వేసే ప్రసక్తే లేదు. కంచం- మంచం అనేది తెలంగాణలో ఊతపదం అని ప్రజలకు తెలుసు. కంచం పొత్తు అనగా తినడం కలసి ఉండటం కలసి పని చేయడం. మంచం పొత్తు అనగా వియ్యం ఇచ్చుకోవడం పుచ్చుకోవడం (పెళ్లి సంబంధాలు) లేదు అని అర్థం లో వాడుతారు. అది బూతు కాదు. అది అర్థం కాని వాళ్ళను ఏమి చేయలేం. రౌడీల్లా వచ్చి మాపై దాడి చేయడం కరెక్ట్ కాదు. నా వ్యాఖ్యలకు కట్టుబడే ఉన్నాను. నేను తప్పు మాట్లాడానా లేదా అన్నది ప్రజలు నిర్ణయిస్తారు. నా ఆఫీస్‌లో నా రక్తం కళ్లజూశారు. ఇలాంటి ఘటనలపై తెలంగాణ ప్రభుత్వం స్పందించాలి. ఈ దాడి ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేశాం. పోలీసులపై, న్యాయ వ్యవస్థపై మాకు నమ్మకం ఉంది. న్యాయం జరుగుతుందనే నమ్ముతున్నాం. భవిష్యత్తులో మిమ్మల్ని రాజకీయంగా పాతాళానికి తొక్కుతాం. బీసీ సమస్యలపై మా సలహాలను ప్రభుత్వం స్వీకరిస్తోంది. ఇందులో కవితకు వచ్చిన బాధ ఏంటో అర్థం కావడం లేదు. సహచర ఎమ్మెల్సీపై హత్యాయత్నం చేపించిన కవిత ఎమ్మెల్సీ సభ్యత్వాన్ని ప్రభుత్వం రద్దు చేయాలి. కవిత తన ఉనికి కోసం కేసీఆర్ ను ప్రశ్నించాలి. కేటీఆర్ తో పోరాడాలి. కానీ ఫ్రస్ట్రేషన్లో ఉన్నా కదా అని తోటి ప్రజాప్రతినిధులపై దాడులు చేపించడం సరికాదు. వీటి వల్ల ప్రజల్లో మరింత చులకన అవుతారు' అని ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న అన్నారు.

# అమరావతిలో పింఛన్ పునరుద్ధరణ

నిరుపేదలకు పెన్షన్ పునరుద్ధరణకు ఆమోదం తెలిపారు. ఈ మేరకు రాజధాని అమరావతి నిర్మాణంలో ఉపాధి కోల్పోయిన కుటుంబాలకు పెన్షన్ మంజూరు చేస్తూ పురపాలక శాఖ ముఖ్య కార్యదర్శి సురేష్ కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. అమరావతి నిర్మాణానికి అదనంగా భూ సేకరణకు రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల చర్యలు చేపట్టింది. అందులో భూమిని ఇచ్చే వారికి ఎంత పరిహారం, ప్రయోజనం దక్కుతుందో పురపాలక శాఖ గెజిట్ నోటిఫికేషన్ సైతం జారీ చేసింది. అందులోనూ ఆ భూ సేకరణ కారణంగా జీవనోపాధి కోల్పోతున్న భూమి లేని నిరుపేదలకు పింఛన్ ఇస్తామని స్పష్టం చేసింది. కాగా, నేలపాడులో ప్రజా ప్రతినిధులు, అధికారుల క్వార్టర్స్ పెండింగ్ పనులకు ఏపీ ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. 524 కోట్ల రూపాయలు మంజూరు చేయడంతో పాటు పరిపాలనా పరమైన అనుమతులు సైతం ఇచ్చింది. అక్కడ 18 టవర్లలో మొత్తం 432 అపార్ట్మెంట్ యూనిట్లు నిర్మిస్తున్నారని తెలిసింది.

# ప్రజల కోసమే ప్రతి రూపాయి ఖర్చు

విక్రమార్క, రాష్ట్ర ఆబ్కారీ, పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి- జిల్లా ఇన్చార్జ్ మంత్రి జూపల్లి కృష్ణారావు, రాష్ట్ర సమాచార సాంకేతిక, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు, జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ - ఉట్నూర్ ప్రాజెక్టు అధికారి ఖుష్బూ గుప్తా, మంచిర్యాల నియోజకవర్గ ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు, జిల్లా అటవీ అధికారి శివ్ ఆశిష్ సింగ్, జి.సి.సి. చైర్మన్ కొట్నాక తిరుపతి, కనీస వేతన బోర్డు చైర్మన్ జనక్ ప్రసాద్ లతో కలిసి ప్రారంభించారు.

### సామాజిక ఆరోగ్య కేంద్రం ఏర్పాటు

ఈ సందర్భంగా రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల ఆరోగ్యానికి అధిక ప్రాధాన్యతనిస్తూ రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ ఆసుపత్రుల ఏర్పాటు, నవీకరణ కార్యక్రమాలను చేపట్టింది. ఇందులో భాగంగా లక్షెట్టిపేట మండల కేంద్రంలో 8 కోట్ల 50 లక్షల రూపాయల ప్రభుత్వ నిధి, 1 కోటి రూపాయల సింగరేణి నిధులతో సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని ఏర్పాటు చేశాం. ప్రజలకు మరింత మెరుగైన, వేగవంతమైన వైద్య సేవలు అందించడం కొరకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

### జూనియర్ కాలేజీ, స్కూళ్లు ఏర్పాటు

లక్షెట్టిపేట మండల కేంద్రంలో 10 కోట్ల 20 లక్షల రూపాయల సి.ఎస్.ఆర్, డి.ఎం.ఎఫ్.టి. నిధులతో ప్రభుత్వ జూనియర్ కళాశాల, ప్రభుత్వ ఉన్నత పాఠశాలలను ఏర్పాటు చేశాం. తరగతి గదులు, మధ్యాహ్న భోజనం నాణ్యత, పరిసరాలను పరిశీలించి విద్యార్థులతో మాట్లాడారు. అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీ ఆధ్వర్యంలో అన్ని ప్రభుత్వ పాఠశాలలలో విద్యార్థిని, విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పూర్తి స్థాయిలో సౌకర్యాలు కల్పించాం. డైట్ చార్జీలు 40 శాతం, కాస్మోటిక్ చార్జీలు 200 శాతం పెంచి నూతన మెనూ ఖచ్చితంగా అమలు చేస్తూ విద్యార్థులకు పౌష్టికాహారాన్ని అందించాం. విద్యారంగాన్ని బలోపేతం చేస్తూ ఉపాధ్యాయుల నియామకం ద్వారా అన్ని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందిస్తున్నాం.

### మహిళా సాధికారతకు కాంగ్రెస్ ప్రభుత్వం చర్యలు

మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు ప్రభుత్వం అనేక కార్యక్రమాల ద్వారా ప్రోత్సహిస్తున్నాం. మంచిర్యాల జిల్లా దండేపల్లి మండలం రెబ్బెనపల్లి గ్రామంలో ఇందిరా మహిళా శక్తి సోలార్ పవర్ ప్లాంట్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన బహిరంగ సభలో భట్టి విక్రమార్క మాట్లాడుతూ ఇందిరా మహిళా శక్తి పథకంలో భాగంగా మహిళలకు చేయూతనిస్తూ దండేపల్లి మండలం అందుగులపేట (వెల్గనూర్) గ్రామంలో 4 ఎకరాల విస్తీర్ణంలో 3 కోట్ల రూపాయల వ్యయంతో సోలార్ పవర్ ప్లాంట్ ఏర్పాటు చేశాం. 90 శాతం బ్యాంకు రుణం, 10 శాతం గ్రామ సంఘాల వాటాతో రోజుకు సుమారు 4 వేల 500 నుండి 5 వేల యూనిట్ల వరకు విద్యుత్ ఉత్పత్తి జరిగి సంవత్సరానికి దాదాపు 51 లక్షల రూపాయల రాబడి వస్తుంది.

### పంచాయతీ, అంగన్వాడీ భవనాలు నిర్మాణం

నర్సింగాపూర్ గ్రామంలో 1 కోటి 63 లక్షల రూపాయల సి. ఎస్. ఆర్. నిధులతో 2/200 కి.మీ. నుండి 3/100 కి. మీ. కొరకు 900 మీటర్ల మేర సి.సి. రోడ్డు నిర్మాణం చేపట్టినట్లు తెలిపారు. 80 లక్షల రూపాయల మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులతో 4 గ్రామపంచాయతీ భవనాలు, 48 లక్షల రూపాయలతో 4 అంగన్వాడి భవనాల నిర్మాణం చేపట్టడం జరుగుతుందని తెలిపారు. లక్షెట్టిపేట మండలంలోని లక్ష్మీపూర్ గ్రామంలో 1 కోటి రూపాయలతో ఎస్.సి.ఎస్.డి.ఎఫ్. క్రింద సి. సి. రోడ్లు, మురుగు కాలువల నిర్మాణం చేపట్టారు. హాజీపూర్ మండలం చిన్న గోపాల్ పూర్, ర్యాలీ గ్రామాలలో 2 కోట్ల 50 లక్షల రూపాయల ఎస్.టి.ఎస్.డి.ఎఫ్., ఎస్.సి.ఎస్.డి.ఎఫ్ నిధులతో నిర్మాణాలు చేపట్టడం జరుగుతుందని తెలిపారు. వేంపల్లి, పోచంపహాడ్ శివారులలో 212 ఎకరాల భూమి విస్తీర్ణంలో 30 కోట్ల రపాయల వ్యయంతో అత్యాధునిక సదుపాయాలతో ఐ. టి./ ఇండస్ట్రియల్ పార్క్ ను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.మహిళా సంఘాల బలోపేతానికి ప్రభుత్వం కృషి చేస్తుందని, కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలని లక్ష్యంగా ఆర్థిక అభివృద్ధి కోసం సంవత్సరానికి 20వేల కోట్ల రూపాయలు వడ్డీ లేని రుణంగా అందించేందుకు చర్యలు తీసుకుంటాం. మొదటి సంవత్సరం 21 వేల 632 కోట్ల రూపాయలు అందించామని తెలిపారు. మహిళా సంఘాల ఆధ్వర్యంలో ఆర్. టి. సి. బస్సులు నడిపించేందుకు 600 బస్సుల ప్రతిపాదనలో 150 బస్సులను ఇవ్వడం జరిగిందని, త్వరలో 450 బస్సులను ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.

### మహిళల కోసం కృషి చేస్తున్న ప్రభుత్వం

ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్లు, పెరటి కోళ్ల పెంపకం, పాల డైరీ, పెట్రోలు బంకుల నిర్వహణ, మహిళా శక్తి భవనాల ఏర్పాటు, చిన్న పరిశ్రమల ఏర్పాటుకు ప్రోత్సహించడం జరుగుతుందని తెలిపారు. రైతు సంక్షేమంలో భాగంగా 70 లక్షల రైతు కుటుంబాలకు రైతు భరోసా క్రింద 9 రోజులలో 9 వేల కోట్ల రూపాయల పెట్టుబడి సహాయం అందించామని భట్టి విక్రమార్క అన్నారు. 21 వేల కోట్ల రూపాయల రుణమాఫీ చేయడంతో పాటు పంట నష్టపరిహారం అందించాం. 29 లక్షల పంప్ సెట్లను 17 వేల కట్ల రూపాయలతో ఏర్పాటు చేశామన్నారు. 93 లక్షల కుటుంబాలకు సన్న బియ్యం అందించడం జరిగిందని, రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకం పరిమితిని 10 లక్షల రూపాయలకు పెంచినట్లు తెలిపారు.

### జులై 12 నుంచి వడ్డీ లేని రుణాలు ప్రారంభం

అర్హులైన లబ్ధిదారులకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందిస్తున్నాం. నియోజకవర్గానికి 3 వేల 500 చొప్పున రాష్ట్ర వ్యాప్తంగా 4 లక్షల 50 వేల ఇందిరమ్మ ఇండ్లను 22 వేల 500 కోట్ల రూపాయలతో లబ్ధిదారులకు అందిస్తున్నట్లు తెలిపారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, 500 రూపాయలకే రాయితీ గ్యాస్ సిలిండర్ అందిస్తున్నాం. పేదింటి ఆడపిల్లల వివాహానికి కళ్యాణ లక్ష్మి, షాది ముబారక్ పథకం ద్వారా డబ్బులు ఇస్తున్నట్లు తెలిపారు. ప్రాణహిత -చేవెళ్ల ప్రాజెక్టును తిరిగి మొదలు పెడతామని, రాజీవ్ యువ వికాసం పథకం ద్వారా నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి కొరకు ఆర్థిక చేయూత అందిస్తాం

ఇందిరా సౌర గిరి జల వికాసం పథకం ద్వారా 6 లక్షల 70 వేల ఎకరాలకు సోలార్ పంపుసెట్లను అమర్చుతున్నాం. ప్రజల కోసమే ప్రతి రూపాయి ఖర్చు చేస్తామని తెలిపారు. ఈ నెల 12వ తేదీ నుండి 20వ తేదీ వరకు రాష్ట్ర వ్యాప్తంగా మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాన్ని అందించడం జరుగుతుందని తెలిపారు. పేద విద్యార్థులకు అంతర్జాతీయ విద్య ప్రమాణాలతో యంగ్ ఇండియా ఇంటర్నేషనల్ స్కూల్స్ ప్రారంభిస్తున్నామని తెలిపారు.జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ మంచిర్యాల జిల్లాను పూర్తి స్థాయిలో అభివృద్ధి చేసి రాష్ట్రంలో ఆదర్శంగా నిలిపేందుకు చర్యలు చేపడుతున్నామని తెలిపారు. లక్షెట్టిపేట మండల కేంద్రంలో కార్పొరేట్ స్థాయిలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల, జూనియర్ కళాశాలలను ప్రారంభించాం, ప్రారంభించిన అతి తక్కువ కాలంలో విద్యార్థుల సంఖ్య రెట్టింపు అయిందని తెలిపారు.

విద్యారంగాన్ని బలోపేతం చేస్తూ ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలతో ప్రైవేట్ పాఠశాలల నుండి విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలలలో చేరుతున్నారని తెలిపారు. మహిళలకు ఆర్థిక చేయూతను అందించేందుకు ఇందిరా మహిళా శక్తి సోలార్ పవర్ ప్లాంట్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నాం, ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటు కొరకు హాజీపూర్ మండలం వేంపల్లి లో భూ సేకరణ ప్రక్రియ పూర్తి చేసి పార్క్ ఏర్పాటుకు శంకుస్థాపన చేయడం జిల్లా అభివృద్ధికి ఎంతో దోహదపడుతుందని అన్నారు.

### స్వయం సహాయక సంఘాలకు చెక్కులు

జిల్లాలోని 863 స్వయం సహాయక సంఘాలకు బ్యాంకు లింకేజీ ద్వారా 80 కోట్ల రూపాయల చెక్కులు అందజేశారు. 8 మంది ప్రమాద బీమా లబ్ధిదారులకు ఒక్కొక్కరికి 10 లక్షల చొప్పున చెక్కులు పంపిణీ చేశారు. రుణ బీమా సంబంధించి 73 లక్షల 37 వేల రూపాయలను 83 మంది సభ్యులకు అందజేశారు. వడ్డీ లేని రుణాలు 8 వేల 750 మందికి 17 కోట్ల 78 లక్షల రూపాయలు ఇచ్చామని తెలిపారు. అనంతరం హాజీపూర్ మండలం వేంపల్లి గ్రామ శివారులో 212 ఎకరాలలో 30 కోట్ల రూపాయల అంచనా వ్యయంతో ఇండస్ట్రియల్ పార్క్, ఆటోనగర్ ఏర్పాటు కొరకు భూమి పూజ నిర్వహించారు. ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటు ద్వారా రాబోయే రోజులలో 2 వేల మందికి ఉపాధి లభిస్తుందని, పెద్ద మొత్తంలో పరిశ్రమలు ఏర్పాటు అవుతాయని తెలిపారు. అటవీ శాఖ సంబంధించిన నూతన వాహనాలను ప్రారంభించి వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటారు.

# తీన్మార్ మల్లన్న ఆఫీసుపై దాడి

నువ్వేమైనా బీసీవా, బీసీలకు ఏమొస్తే నీకెందుకు అని ఘాటు వ్యాఖ్యలు చేశారు. మేడిపల్లిలోని తీన్మార్ మల్లన్న ఆఫీసు మీద దాడి చేసి, ఫర్నిచర్, కిటికీ అద్దాలను ధ్వంసం చేశారు. తమ ఆఫీసుపై జరుగుతున్న దాడిని అడ్డుకునేందుకు, పరిస్థితిని అదుపు చేసేందుకు తీన్మార్ మల్లన్న గన్ మెన్ గాల్లోకి కొన్ని రౌండ్లు కాల్పులు జరిపినట్లు సమాచారం. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని దాడులకు పాల్పడిన ఆందోళనకారులను అదుపులోకి తీసుకునే ప్రయత్నం చేశారు.

### కాల్చిపడేస్తా అని ఆందోళనకారులకు గన్ మెన్ వార్నింగ్

ఎమ్మెల్సీ కవితపై తీన్మార్ మల్లన్న అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ మేడిపల్లిలోని ఎమ్మెల్సీ కార్యాలయంపై తెలంగాణ జాగృతి కార్యకర్తలు, ఆమె అనుచరుల వంద మంది వరకు వెళ్లి దాడి చేశారు. ఆఫీసులో ఫర్నీచర్ ధ్వంసం చేస్తూ, దాడులకు దిగిన సమయంలో డోర్లు మూసివేసి ప్రాణరక్షణ కోసం ప్రయత్నించారు. డోర్ అద్దాలు పగలగా అందులోనుంచి గన్ ఎక్కుపెట్టి గన్ మెన్ ఆందోళనకారులను హెచ్చరించారు. ఎవరైనా ముందుకొస్తే కాల్చిపడేస్తాను అక్కడి నుంచి వెళ్లిపోవాలంటూ గన్ మెన్ హెచ్చరించిన వీడియోలు వైరల్ అవుతున్నాయి. ఏసీపీ, సీఐ, మేడిపల్లి పోలీసులు తీన్మార్ మల్లన్న ఆఫీసుకు వెళ్లి పరిశీలించారు. ఘటన వివరాలను ఎమ్మెల్సీ ఆఫీసు సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు.

### తీన్మార్ మల్లన్న ఆఫీసులో రక్తపు మరకలు

కొందరు ఆందోళనకారులు ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న ఆఫీసులోకి చొరబడి హంగామా చేశారు. కొంత సమయంపాటు ఆఫీసులో బీభత్సం సృష్టించారు. గన్ మెన్ కాల్చిపారేస్తా అని హెచ్చరించినా ఆందోళనకారులు వెనక్కి తగ్గకుండా ఫర్నీచర్ ధ్వంసం చేస్తూ ముందుకు దూసుకెళ్లారు. ఆఫీసులో చాలా వరకు రక్తపు మరకలు కనిపించడం కలకలం రేపుతోంది. ఈ దాడుల్లో, గన్ మెన్ కాల్పుల్లో కొందరికి తీవ్ర గాయాలైనట్లు తెలుస్తోంది. గాయపడిన వారికి తీవ్ర రక్తస్రావం కావడంతో తీన్మార్ మల్లన్న ఆఫీసులో రక్తపు మరకలు కనిపించాయి.

# అమరావతిలో సింగపూర్

చంద్రబాబు అయిదు రోజుల పాటు సింగపూర్ లో పర్యటించనున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు సింగపూర్ పర్యటన ఖరారైంది. ఈ నెల 26 నుంచి ఐదు రోజుల పాటు సీఎం చంద్రబాబు సింగపూర్ పర్యటనకు వెళ్లనున్నారు. సీఎం తో పాటుగా మంత్రులు లోకేష్ నారాయణ, పయ్యావుల కేశవ్, అనగాని సత్యప్రసాద్ వెళ్లనున్నారు. 2014-19 కాలంలో రాజ ధాని అమరావతిగా ఖరారు అయిన తరువాత మాస్టర్ ప్లాన్ తో పాటుగా సింగపూర్ కన్సెల్టెన్సీ లు కీలక పాత్ర పోషించాయి. అప్పటి సింగపూర్ మంత్రి ఈశ్వరన్ పలు సందర్భాల్లో ఏపీలో పర్యటిం చారు. చంద్రబాబు టీం అప్పట్లో సింగపూర్ ను పలు మార్లు సందర్శించారు. సింగపూర్ టీం రాజధాని వ్యవహారాల్లో కీలకంగా వ్యవహరించింది.ఇక, 2019 లో టీడీపీ ఓడిపోయిన తరువాత సింగపూర్ తో సంప్రదింపులు నిలిచిపోయాయి. తిరిగి 2024 ఎన్నికల్లో చంద్రబాబు సీఎం అయిన తరువాత మరోసారి సింగపూర్ తో భాగస్వామ్యం గురించి కేంద్రంతోనూ చర్చించారు. ఇప్పుడు రాజధాని వ్యవహారాల పైన సింగపూర్ తో చర్చల కోసం సిద్దమైనట్లు తెలుస్తోంది. ఈ సారి పర్యటనలో ఏపీ కి సంబంధించి పెట్టుబడులు, పరిశ్రమల ఏర్పాటు పై చర్చ చేస్తారని తెలుస్తోంది. అదే విధంగా రాజధాని మాస్టర్ ప్లాన్ ఇతర అంశాలపై కూడా చర్చించే అవకాశం ఉందని సమాచారం. కాగా, సింగపూర్ కేంద్రంగా చంద్రబాబు టీం చేసుకునే ఒప్పందాలు నిర్ణయాలు ఇప్పుడు అమరావతి భవిష్యత్ లో కీలకంగా మారనున్నాయి.

# వదిలిపెట్టేది లేదు.. తీన్మార్ మల్లన్న జాగ్రత్త

ఆన్ ఎథిక్స్"కు రెఫర్ చేయాలని కోరారు. అనంతరం లా అండ్ ఆర్డర్ ఐజీ రమణ కుమార్ కు ఫిర్యాదు చేశారు. తనపై అనుచిత వ్యాఖ్యలు చేసిన తీన్మార్ మల్లన్నపై చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత కోరారు.

### బీసీ రిజర్వేషన్ బిల్లులు..

తెలంగాణ జాగృతి చేసిన ఉద్యమాలకు దిగివచ్చే రాష్ట్ర ప్రభుత్వం శాసన సభ, శాసన మండలిలో బీసీలకు స్థానిక సంస్థల్లో 42 శాతం రాజకీయ రిజర్వేషన్లు, విద్య, ఉద్యోగాల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ రెండు వేర్వేరు బిల్లులు ప్రవేశ పెట్టి ఆమోదించింది. ఈ బిల్లు చట్టరూపం దాల్చడానికి ఆలస్యమవుతుండటంతో ఢిల్లీ వేదికగా ఉద్యమం చేపట్టి కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువచ్చే ప్రయత్నం చేశాము. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు రాష్ట్రంలో 42 శాతం రిజర్వేషన్లు కల్పించేలా రాష్ట్ర ప్రభుత్వానికి ఆదేశాలు ఇవ్వాలని కాంగ్రెస్ పార్టీ అధినాయకత్వంపైనా ఒత్తిడి తీసుకువచ్చాము. ఈ పోరాటాలు, ఉద్యమాల ఫలితంగానే రాష్ట్ర కేబినెట్ బీసీలకు చట్ట సభల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ తీర్మానం చేసి గవర్నర్ ఆమోదం కోసం పంపింది.

### నాపై తీన్మార్ మల్లన్న అనుచిత వ్యాఖ్యలు..

రాష్ట్ర కేబినెట్ బీసీ రిజర్వేషన్లకు ఆమోదం తెలిపిన నేపథ్యంలో తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో సంబరాలు నిర్వహించాము. సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ నియోజకవర్గంలోని ఝరాసంగం లో నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న ఈ సంబరాలపై స్పందిస్తూ నాపై అనుచిత వ్యాఖ్యలు చేశారు. చట్టసభలో సభ్యురాలినైనా నాపైనే ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న గారు ఈ తరహా వ్యాఖ్యలు చేశారంటే సమాజంలోని సామాన్య మహిళల విషయంలో ఆయన ఎలాంటి భావనతో ఉంటారో అర్థం చేసుకోవచ్చు. తీన్మార్ మల్లన్న గారు నాపై చేసిన అనుచిత వ్యాఖ్యలను శాసన మండలిలోని ఎథిక్స్ కమిటీకి రెఫర్ చేయాలని రూల్ నెంబర్ 262-సి, సబ్ రూల్ 1 కింద కోరుతున్నాను' అని ఎమ్మెల్సీ కవిత ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదుతో పాటు ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న చేసిన కామెంట్లకు సంబంధించిన పెన్ డ్రైవ్, ట్రాన్స్ క్రిప్ట్ కూడా అందజేసినట్లు తెలిపారు.

### గన్ ఫైర్ చేసి చంపేస్తారా!

ఎమ్మెల్సీ కవిత మీడియాతో మాట్లాడుతూ తెలంగాణ లో ఆడబిడ్డలంటే ఎంతో గౌరవం. బీసీ బిడ్డల్లో గౌరవించే అవకాశం ఎక్కువగా ఉంటుంది.

పరుష పదజాలం వాడడంతో రాజకీయాల్లోకి మహిళలు రావాలంటే భయపడే పరిస్థితి. బీసీ రిజర్వేషన్ల అమలుకై తెలంగాణ జాగృతితో పోరాటం చేస్తూనే ఉన్నాం. మీరు బీసీ కాబట్టి ఏదీ పడితే అదీ మాట్లాడితే సరికాదు. తీన్మార్ మల్లన్న మీరు మాట్లాడిన మాటలకు మావాళ్ళకు కోపం వచ్చి నిరసన తెలిపారు. అంత మాత్రనికే గన్ ఫైర్ చేసి చంపేస్తారా! నేను ఊరుకునే ప్రసక్తే లేదు. సీఎం రేవంత్ రెడ్డి స్పందించి వెంటనే చర్యలు తీసుకోవాలి. లేకపోతే వెనకనుండి మీరు మాట్లాడించారని భావించాల్సి వస్తుంది.

### ఫైరింగ్ మీద పూర్తి ఎంక్వైరీ చేయాలి

24 గంటలు గడిచిన ప్రభుత్వం చర్యలు తీసుకోకపోవడం విడ్డూరం.. వెంటనే చర్యలు తీసుకోవాలి. ఇప్పుడు సెషన్స్ లేవు కాబట్టి. మీరు ఎథిక్స్ కమిటీకి పిర్యాదు చేయాలని మండలి ఛైర్మన్ సూచించారు. ఎమ్మెల్సీ మహిళా నేతపై చేసిన వ్యాఖ్యల్ని పట్టించుకోకపోతే.. సాధారణ మహిళల పరిస్థితి ఏంటీ? ఫైరింగ్ మీద పూర్తి ఎంక్వైరీ చేయాలని సీఎం, డీజీపీకీ రిక్వెస్ట్ చేస్తున్నాం. వెంటనే తీన్మార్ మల్లన్న ఎమ్మెల్సీ సభ్యత్వం నుంచి సస్పెండ్ చేయాలి. తీన్మార్ మల్లన్న ఎవరు. ఎందుకు గోల గోల చేస్తున్నాడు' అన్నారు.

# మేటి నటుడికి కడసారి వీడ్కోలు

**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** విలక్షణ నటుడు కోట శ్రీనివాసరావు అంత్యక్రియలు ముగిశాయి. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన ఆదివారం (జూలై 13) ఉదయం హైదరాబాద్‌లోని ఫిల్మ్ నగర్‌లోని తన నివాసంలో తుదిశ్వాస విడిచారు. ఆయన వయస్సు 83 సంవత్సరాలు. సినీ ప్రముఖులు, అభిమానుల కన్నీటి వీడ్కోలు మధ్య ఆయన అంత్యక్రియలు హైదరాబాద్‌లోని మహాప్రస్థానంలో జరిగాయి. ఆయన పెద్ద మనవడు శ్రీనివాస్ అంతిమ సంస్కారాలు నిర్వహించారు.

ఫిల్మ్ నగర్‌లోని ఆయన నివాసం నుంచి మహాప్రస్థానం వరకు అంతిమ యాత్ర సాగింది. వందలాది మంది సినీ ప్రముఖులు, అభిమానులు ఆయనకు కడసారి నివాళు లర్పించారు. మెగాస్టార్ చిరంజీవి, ప్రకాశ్ రాజ్, వెంకటేశ్, రానా దగ్గుబాటి వంటి పలువురు సినీ ప్రముఖులు కోట శ్రీనివాసరావుకు నివాళులర్పించారు. చిరంజీవి ఆయన భౌతిక కాయంపై పుష్పగుచ్ఛం ఉంచి, ఆయనతో తనకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. వీరిద్దరూ ఒకే సినిమాతో (ప్రాణం ఖరీదు, 1978) తమ సినీ ప్రయాణాన్ని ప్రారంభించారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి, ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు, తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు, ఏపీ బీజేపీ అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ తదితర రాజకీయ ప్రముఖులు కూడా ఆయన నివాసానికి వెళ్లి నివాళులర్పించారు.

కోట శ్రీనివాసరావు తెలుగు సినీ చరిత్రలో తనదైన ముద్ర వేశారు. నాలుగు దశాబ్దాలకు పైగా తన సినీ జీవితంలో 750కి పైగా సినిమాల్లో నటించారు. ఆయన విలక్షణమైన నటనకు, ముక్కుసూటి వ్యక్తిత్వానికి పేరుగాంచారు. పద్మశ్రీ పురస్కారం అందుకున్న కోట శ్రీనివాసరావు 1999 నుండి 2004 వరకు విజయవాడ తూర్పు నియోజకవర్గం నుండి బీజేపీ ఎమ్మెల్యేగా కూడా పనిచేశారు. ఆయన మరణం తెలుగు చిత్ర పరిశ్రమకు తీరని లోటు.

## హెూటల్ రూమ్‌లో భార్యతో గొడవ.. ఆరేళ్ల కుమారుడ్ని కొట్టి చంపిన తండ్రి




పాట్నా: హెూటల్ రూమ్‌లో బస చేసిన భార్యాభర్తల మధ్య గొడవ జరిగింది. ఈ నేపథ్యంలో ఆ వ్యక్తి ఆరేళ్ల కుమారుడ్ని కొట్టి చంపాడు. ఆ తర్వాత అక్కడి నుంచి పారిపోయాడు. ఈ సమాచారం తెలుసుకున్న పోలీసులు ఆ హెూటల్ వద్దకు చేరుకున్నారు. బీహార్ రాజధాని పాట్నాలో ఈ సంఘటన జరిగింది. ప్రభాకర్ మహతో అనే వ్యక్తి తన భార్య, ఆరేళ్ల కుమారుడితో కలిసి పాట్నా చూసేందుకు శనివారం అక్కడకు చేరుకున్నాడు. పాట్నా రైల్వే స్టేషన్ సమీపంలోని ఒక హెూటల్‌లో వారు బస చేశారు.కాగా, శనివారం రాత్రి ఆ హెూటల్ గదిలో భార్యాభర్తల మధ్య గొడవ జరిగింది. ఈ నేపథ్యంలో ఆగ్రహించిన ప్రభాకర్ ఆరేళ్ల కుమారుడైన సన్నీని దారుణంగా కొట్టాడు. ఆ తర్వాత నేలపైకి అతడ్ని విసిరేశాడు. అనంతరం ఆ హెూటల్ నుంచి పారిపోయాడు.మరోవైపు ఈ సమాచారం అందుకున్న పోలీసులు ఆ హెూటల్‌కు చేరుకున్నారు. తీవ్రంగా గాయపడిన బాలుడ్ని హాస్పిటల్‌కు తరలించారు. అయితే చికిత్స పొందుతూ సన్నీ మరణించాడు. ఈ నేపథ్యంలో భార్య ఫిర్యాదుతో భర్త ప్రభాకర్‌పై పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ సంఘటనపై దర్యాప్తు చేస్తున్నట్లు పోలీస్ అధికారి వెల్లడించారు.

కార్మికుల పక్షాన ఎల్లవేళలా పోరాడుతా.. ఆటో డ్రైవర్ల సమస్యలపై ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి %ూబ్శీ ఎతీఅజవతీం% ఎ కార్మికుల పక్షాన ఎల్లవేళలా పోరాడుతానని మీకు తోడుగా ఉంటానని భరోసా ఇచ్చారు. అదేవిధంగా కార్మికులకు సోషల్ సెక్యూరిటీ ఇన్సూరెన్స్ కింద ఐదు లక్షల ఇన్సూరెన్స్ స్కీమును రెన్యువల్ చేయాలని.. డ్రైవర్ వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేసే విధంగా పోరాడుతానని తెలిపారు.

## కార్మికుల పక్షాన ఎల్లవేళలా పోరాడుతా.. ఆటో డ్రైవర్ల సమస్యలపై ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి



మల్కాజిగిరి : ఎన్నికల ముందు ఆటో డ్రైవర్లకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి కోరారు. ఆదివారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో తెలంగాణ సేఫ్టీ టాక్సీ డ్రైవర్స్ అసోసియేషన్ తెలంగాణ రాష్ట్ర సమితి కార్మిక విభాగం నూతన కమిటీ సభ్యులు ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డిని హృదయపూర్వకంగా కలిసి తమ సమస్యలను పరిష్కరించే విధంగా కృషి చేయాలన్నారు.వెంటనే ఎమ్మెల్యే నూతన కమిటీ సభ్యులను శాలువాతో సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ.. కార్మికుల పక్షాన ఎల్లవేళలా పోరాడుతానని మీకు తోడుగా ఉంటానని భరోసా ఇచ్చారు. అదేవిధంగా కార్మికులకు సోషల్ సెక్యూరిటీ ఇన్సూరెన్స్ కింద ఐదు లక్షల ఇన్సూరెన్స్ స్కీమును రెన్యువల్ చేయాలని.. డ్రైవర్ వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేసే విధంగా పోరాడుతానని తెలిపారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షులు ఆత్తిన మోని నగేష్ కుమార్, వీరయ్య, షఫీహుద్దీన్, రాజు యాదవ్, ఆటో కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో కొడుకుతో పాటు బీఆర్ఎస్ నాయకుడు, ఆదివాసీ ఉద్యమ నేత మృతి



కాసిపేట : మంచిర్యాల జిల్లా కాసిపేట మండలంలోని దేవాపూర్ రాంపూర్ చెందిన బీఆర్ఎస్ నాయకుడు, ఆదివాసీ ఉద్యమ నేత సిడం శంకర్ (38), కుమారుడు సాగర్(12) శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు.సిడం శంకర్ తన భార్య సుమిత్ర, ఇద్దరు కుమారులు సాగర్, సంతోష్ లతో కలిసి బైక్ పై దండేపల్లి మండలానికి వెళ్లి తిరిగి వస్తుండగా లక్షెట్టిపేట ఇటిక్యాల వద్ద బైక్ ను కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో పెద్ద కుమారుడు సాగర్ అక్కడికక్కడే మృతి చెందగా శంకర్‌ను ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమద్యలో మృతి చెందాడు. భార్య సుమిత్ర, చిన్న కుమారుడు సంతోష్‌కు తీవ్రగాయాలు కావడంతో కరీంనగర్ ఆసుపత్రికి తరలించారు.సిడం శంకర్ దేవాపూర్ సిమెంట్ కంపెనీలో లోడింగ్ కార్మికుడిగా విధులు నిర్వహిస్తు అనేక ఆదివాసీ ఉద్యమాల్లో కీలక పాత్ర పోషించి హక్కుల కోసం పోరాడాడు. తుడుందెబ్బ ఉపాధ్యక్షుడిగా సేవలు అందిస్తున్నాడు. కనీస డ్యూటీలు ఇవ్వాలని శంకర్ ఆందోళనతోనే ప్రస్తుతం కంపెనీలో లోడింగ్ కార్మికులకు కనీస 21 మాస్టర్ల డ్యూటీ విధానం అమలు అవుతుంది. బీఆర్ఎస్ పార్టీలోను కీలక పాత్ర పోషించారు.సిడం శంకర్ మృతి వార్త తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య మంచిర్యాల ఆసుపత్రిలో ఉన్న మృతదేహాలను సందర్శించారు. సిడం శంకర్ హఠాత్మరణం తీవ్రంగా కలిచివేసిందని పేర్కొన్నారు. ఆయన మృతి ఆదివాసీ సమాజానికి, బీఆర్ఎస్ పార్టీకి తీరని లోటని పేర్కొన్నారు. గ్రామంలో నిర్వహించిన అంతమయాత్రకు భారీగా తరలివచ్చి కన్నీటి వీడ్కోలు పలికారు.

## మైనర్ పై యువకుడు లైంగిక దాడి



సైదాబాద్, జూలై 13 : పదేళ్ల మైనర్ బాలికపై ఓ యువకుడు లైంగిక దాడికి పాల్పడిన సంఘటన సైదాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం సైదాబాద్‌లో నివసించే ఓ మహిళకు బాలుడు, బాలిక (10) ఉన్నారు. ఇంటి సమీపంలో ఉండే ఓ యువకుడు సదరు బాలికకు మాయమాటలు చెప్పి పలుమార్లు అసభ్యంగా ప్రవర్తించాడు. ఇంటి వద్ద ఒంటరిగా ఉన్న బాలికను గమనించి శనివారం సాయంత్రం తన ఇంట్లోకి తీసుకెళ్లి ఆమెపై లైంగిక దాడికి పాల్పడ్డాడు. ఈ విషయాన్ని బాలిక కుటుంబ సభ్యులకు తెలియజేయడంతో వారు శనివారం రాత్రి సైదాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నారు.

## పేకాట ఆడుతున్న ఆరుగురు అరెస్ట్




శంషాబాద్ రూరల్ : పేకాట ఆడుతున్న ఆరుగురు వ్యక్తులను శంషాబాద్ పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించిన సంఘటన ఆదివారం జరిగింది. సీఐ నరేందర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం పోలీస్‌స్టేషన్ పరిధిలోని తొండుపల్లిలో 5స్టార్‌గ్రాండ్ హెూటల్‌లో కొంతమంది పేకాట ఆడుతున్నట్లు సమాచారం రావడంతో పోలీసులు సంఘటన స్థలానికి వెళ్లి చూడగా ఆరుగురు వ్యక్తులు బెట్టింగ్‌లు పెట్టుకొని మూడుముక్కలాట ఆడుతున్నారు. వారిని అదుపులోకి తీసుకొని వారి వద్ద ఉన్న 3,210 రూపాయల నగదుతో పాటు ఆన్‌లైన్ లావాదేవిలు, ఆరు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. తొండుపల్లికి చెందిన అంజయ్య, ఊటుపల్లికి చెందిన ప్రదీప్, జైపాల్, ఎం రాజు, కిషన్‌గూడకు చెందిర కొండరాజు, బాలపూర్‌కు చెందిన నిఖిల్‌కుమార్, హైదరాబాద్ నగరంలోని మాదాపూర్‌కు చెందిన తిరుపతిరావులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించిన్నట్లు తెలిపారు.

## శంషాబాద్ ఎయిర్‌పోర్టులో కారులో మంటలు



శంషాబాద్ రూరల్ : శంషాబాద్ ఎయిర్‌పోర్టులో కారులో మంటలు చెలరేగిన సంఘటన ఆదివారం జరిగింది. ఎయిర్‌పోర్టు అవుట్ పోస్టు సీఐ బాలరాజు తెలిపిన వివరాల ప్రకారం హైదరాబాద్ నుంచి శంషాబాద్ ఎయిర్‌పోర్టులోకి వచ్చిన వోల్వో కారు ఆదివారం ఉదయం 10.55 గంటలకు ఎయిర్‌పోర్టులోకి వచ్చింది. ఒక్కసారిగా కారులో మంటలు రావడంతో గమనించిన డ్రైవర్ కారులో నుంచి కిందకు దిగిపోయాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఫైర్ అధికారులకు సమాచారం ఇవ్వడంతో వెంటనే సంఘటన స్థలానికి చేరుకొని మంటలు పూర్తిగా ఆర్పివేశారు. అప్పటికే కారు ముందుభాగం దెబ్బతిన్నట్లు చెప్పారు. కారులో డ్రైవర్ మాత్రమే ఉన్నాడు. అతడికి ఎలాంటి గాయాలు కాలేదు. దీంతో ఆటు పోలీసులు, ఇటు ప్రజలు ఎయిర్‌పోర్టు అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## కార్మికులకు రూ.5 వేలు ఈపీఎఫ్ ఇవ్వాలి

**- శివంది సత్యం**



రామాయంపేట, : బీడీలు చేసే కార్మికులకు కేంద్ర ప్రభుత్వం ఈపీఎఫ్‌ను నెలకు రూ.5 వేలకు తగ్గకుండా ఇవ్వాలని నూతన బీడీ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శివంది సత్యం పేర్కొన్నారు. ఆదివారం రామాయంపేట పట్టణంలోని బీడీ కారా?నలోకి వెళ్లి కార్మికులతో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం బీడీ కార్మికుల పట్ల పూర్తి వివక్షను చూపిస్తుందని అన్నారు.పొద్దంతా కష్టపడితే వెయ్యి బీడీలకు కనీస వేతనం కూడా రావడం లేదని అలాంటి కార్మికులపై పక్షపాత ధోరణిగా వ్యవహరించడం కేంద్రంకు తగదన్నారు. కేంద్ర ప్రభుత్వం వెంటనే బీడీ పరిశ్రమల యాజమాన్యాలతో మాట్లాడి కార్మికులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. బీడీలు చుట్టేవారితో పాటు గంపచాట్, ప్యాకర్స్ వారికి కూడా ఈపీఎస్ ఐదువేలు వర్తించే విదంగా కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవలాన్నారు.బీడీలు చుట్టే కార్మికులకు నెలలో 25 రోజులపాటు పనులను కల్పించాలన్నారు.సమాన పనికి సమాన వేతనాన్ని కార్మికులకు ప్రభుత్వం పరిశ్రమల యాజమాన్యాలతో ఇప్పించాలన్నారు.

## కొల్హాపూర్ మహాలక్ష్మి అమ్మవారి శక్తి పీఠం దర్శనం.. ప్రత్యేక ప్యాకేజీ టూర్ ప్రకటించిన ఆర్టీసీ




సుల్తాన్ బజార్ : కొల్హాపూర్ మహాలక్ష్మి అమ్మవారి శక్తి పీఠం దర్శనార్థం తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ప్రయాణికుల సౌకర్యం కోసం ప్రత్యేక టూర్ ప్యాకేజీని తీసుకువస్తుందని హైదరాబాద్ డిపో1 మేనేజర్ వేణుగోపాల్ పేర్కొన్నారు. ఈ నెల 18న సాయంత్రం 5 గంటలకు ఎంజీబీఎస్ నుండి సూపర్ లగ్జరీ బస్సు బయల్దేరుతుందని ఆయన వివరించారు. ఈ సర్వీస్ మొదటగా గానుగపూర్‌లో ఉన్న శ్రీ దత్తాత్రేయ స్వామి దర్శనం ముగించుకొని 19న సాయంత్రానికి కొల్హాపూర్ చేరుకుటుందని తెలిపారు. మహాలక్ష్మి శక్తి పీఠం దర్శన అనంతరం పండరీపూర్‌కు చేరుకుంటుందన్నారు . 20వ తేదీన శ్రీ విఠళేశ్వర స్వామి దర్శన అనంతరం సాయంత్రానికి తుల్జాపూర్ చేరుకుంటుంది. భవాని మాత దర్శన అనంతరం 21వ తేదీన తెల్లవారుజామున 4 గంటలకు ఎంజీబీఎస్ చేరుకుంటుందన్నారు. కొల్హాపూర్ మహాలక్ష్మి దర్శనానికి వెళ్ళదలచిన ప్రయాణికులు ఈ సర్వీస్‌ను సద్వినియోగం చేసుకోవాల్సిందిగా ఆయన కోరారు. ముందస్తు రిజర్వేషన్ ఆన్‌లైన్ ద్వారా కూడా చేసుకోవచ్చు. సమీపంలోని బుకింగ్ ఏజెంట్ దగ్గర కూడా టికెట్స్ బుక్ చేసుకోవచ్చుని అన్నారు. ఈ సర్వీస్ నెంబర్ 95595 కాగా, ఒక్కొక్కరికి టికెట్ ధర రూ. 3 వేలుగా నిర్ణయించడం జరిగిందని ఆయన వివరించారు.

## డ్రగ్స్‌పై ఈగల్ టీమ్ పంజా

ఆపరేషన్‌లో 14 మంది గంజాయి వినియోదారులు దొరికిపోయారు. పెడ్లర్స్ గంజాయ్ విక్రయించే వాట్సాప్ కోడ్‌తో పోలీసులు ఈ డెకాయ్ ఆపరేషన్ చేపట్టారు, హైదరాబాద్ ఈగల్ టీమ్ ఇటీవల మహారాష్ట్రకు గంజాయి పెడ్లర్‌ను అదుపులోకి తీసుకుంది. అతడు గచచిబౌలిలోని ఓ ప్రాంతంలో రెగ్యులర్‌గా డ్రగ్స్ విక్రయిస్తున్నట్టుగా గుర్తించిది. అతడి మొబైల్‌లోని కాంటాక్ట్స్‌ను సేకరించిన పోలీసులు గంజాయ్ నెటవర్క్‌ను చేధించే పనిలో పడ్డారు. ఈ క్రమంలోనే డెకాయ్ ఆపరేషన్ నిర్వహించారు. సందీప్ డ్రగ్స్ విక్రయించేందుకు వినియోగించే "భాయ్ బచ్చా ఆగయా భాయ్" కోడ్‌తో పోలీసులు డ్రగ్స్ వినియోగదారులకు పంపించారు. గచ్చిబౌలిలోని గంజాయి విక్రయించే ప్లేస్‌కు రావాలని వారికి చెప్పారు.అనంతరం ఆ ప్రాంతంలో మఫ్టీలో మోహరించిన ఈగల్ టీమ్ గంజాయ్ కొనుగోలు చేసేందుకు వచ్చిన 14 మంది కస్టమర్స్‌ను అదుపులోకి తీసుకుంది. ఇంతమంది కేవలం రెండు గంటల వ్యవధిలోనే అక్కడికి రావడం గమనార్హం. ఈ 14 మందికి నిర్వహించిన యూరిన్ టెస్టులో పాజిటివ్ రావడంతో వారిని డీఅడిక్షన్ సెంటర్లకు తరలించారు. ఈ 14 మందిలో నలుగురు ఐటీ ఉద్యోగులు, ఒక విద్యార్థి, ఒక ప్రాపర్టీ మేనేజర్, ఒక ట్రావెల్ ఏజెన్సీ యజమాని కూడా ఉన్నారు. అయితే ఓ ఒక జంట తమ 4 ఏళ్ల బిడ్డతో గంజాయి కొనడానికి వచ్చారు. వీరిలో భర్తకి పాజిటివ్ అని తేలింది. మరో దంపతుల జంట కూడా గంజాయి కొనుగోలు చేసేందుకు రాగా వారిద్దరికీ పాజిటివ్ వచ్చింది. ఇక, సందీప్ ఫోన్‌లోని ఇతర కాంటాక్ట్స్‌ను ట్రేస్ చేసేందుకు పోలీసులు ప్రయత్నిస్తున్నారు.

## రోడ్లపై గుబులు పుట్టిస్తోన్న పందులు.. పట్టించుకోని అధికారులు



రామాయంపేట : రామాయంపేట పట్టణంలోని పందులు స్వైర విహారం చేస్తున్నాయి. రోడ్లపై విచ్చలవిడిగా తిరుగుతూ జనాలను భయభ్రాంతులకు గురి చేస్తున్నాయి. పట్టణంలో ఏ వీధిలో చూసినా పందుల బెడద కనిపిస్తుంది. ఈ విషయమై పురపాలిక శాఖ అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదటూ ప్రజలు ఆరోపిస్తున్నారు.చేతిలో కర్రలేనిదే కాలనీలోకి వెళ్లడం కష్టమవుతుంది. చిన్న పిల్లలు రోడ్డెక్కితే పందులు పిల్లల వెంట బడి కరుస్తూ దాడులకు తెగబడుతున్నాయి. పట్టణంలోని ప్రధాన వీధుల్లో సైతం పందులు తిరుగడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఇప్పటికే పట్టణవాసులు కోతులు, కుక్కలతో ఇబ్బందులు పడుతుంటే మళ్లీ పందుల గోల ప్రజలను పట్టి పీడిస్తుంది.పందులు గల్లీలోకి వచ్చి ఆదమరిస్తే ఇంట్లోకి చొరబడి తినుబండారాలను ఎత్తుకెళ్తున్నాయి. పందుల బాధ నుండి తమకు విముక్తి కల్గించాలని పురపాలిక శాఖ అధికారులకు పట్టణ వాసులు వేడుకుంటున్నారు.

## కొంపల్లి జయభేరిలో గుంతల మయంగా మారిన అంతర్గత రోడ్లు..!



కుత్బుల్లాపూర్ : కొంపల్లి మున్సిపాలిటీ పరిధిలో జయభేరిలో అంతర్గత రోడ్లు అధ్వానంగా మారాయి. ఇటీవల వర్షాలు పడుతున్న క్రమంలో గుంతల మయంగా మారిన రోడ్లపై గుంతల్లో వర్షపు నీరు నిండిపోయి బురదమయంగా దర్శనమిస్తుంది. వాహనదారులు, పాదాచారులు కాలనీలో రోడ్లపై రాకపోకలు సాగించాలంటే ఇబ్బందులు పడుతున్నారు.పలుమార్లు అధికారులకు కాలనీవాసులు ఫిర్యాదులు చేసినా పట్టించుకున్న పరిస్థితి లేదని వాపోతున్నారు. ఎటు చూసినా బహుళ అంతస్థుల నిర్మాణాలు, 60 ఫీట్ల రోడ్లు ఈ కాలనీలో ఉంటాయి. కానీ మౌలిక సదుపాయాలు కల్పించడంలో అధికారులు పూర్తిగా విఫలం చెందుతున్నారని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.గుంతలమయంగా మారిన రోడ్లతోపాటు డ్రైనేజీ, వీధిలైట్ల సమస్యతో సతమతమవుతున్నమని.. దీనికితోడు వర్షాకాలంలో దోమల బెడద అధికంగా ఉంటుందని నివారణచర్యలకు కొంపల్లి మున్సిపాలిటీ అధికారులు చొరవ చూపాలని స్థానికులు కోరుతున్నారు.

## చెత్త తొలగింపులో శానిటేషన్ సిబ్బంది నిర్లక్ష్యం.. బస్తీల్లో దుర్గంధం

బంజారాహిల్స్: వెంకటేశ్వరకాలనీ డివిజన్ పరిధిలోని పలు బస్తీల్లో చెత్త తొలగింపులోజీహెచ్ఎంసీ శానిటేషన్ విభాగం సిబ్బంది తీవ్ర నిర్లక్ష్యం వహిస్తున్నారు. బంజారాహిల్స్ రోడ్ నెం 14లోని నూర్‌నగర్, ఇబ్రహీంనగర్, గురుబ్రహ్మనగర్ బస్తీల్లో చెత్తను 3 నుంచి 5 రోజులకు ఒకసారే తొలగిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ముఖ్యంగా గురుబ్రహ్మనగర్‌లో ప్రధాన రోడ్డు పక్కన చెత్తను కుప్పలుగా వేస్తున్నారు. ఇండ్లనుంచి తీసుకువచ్చిన చెత్తను ఇక్కడ గుట్టలుగా వేస్తున్న బల్దియా అవుట్‌సోర్సింగ్ సిబ్బంది దానిలోంచి స్క్రాప్‌ను వేరు చేసి పక్కకు పెట్టుకుంటున్నారు. అవసరమైన వస్తువులను తీసుకువెళ్లిన తర్వాత చెత్తను డంపింగ్ యార్డ్‌కు తరలించకుండా అక్కడే వదిలిపెట్టడంతో దారిన వెళ్లేవారు దుర్గంధంతో ఇబ్బందులు పడుతున్నారు. జీహెచ్ఎంసీ అధికారులు తక్షణమే స్పందించి ఈ ప్రాంతాల్లో చెత్తను ప్రతిరోజూ తొలగించేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

## ప్రభుత్వ హాస్టళ్లలో సీట్లు దొరక్క బీసీ విద్యార్థుల ఇక్కట్లు.. సీఎంకు లేఖ

ముషీరాబాద్ : గ్రేటర్ హైదరాబాద్‌లో సహా జిల్లాల్లోని బీసీ హాస్టళ్లలో సీట్లు లభించక బీసీ విద్యార్థులు అష్టకష్టాలు పడుతున్నారని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య తెలిపారు. వెంటనే ప్రభుత్వం 20 శాతం సీట్లను పెంచాలని, కొత్తగా 100 బీసీ హాస్టల్స్‌ను మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కొత్తగా హాస్టళ్లు మంజూరు చేసి బీసి విద్యార్థులను ఆదుకోవడానికి తగు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ మేరకు ముఖ్యమంత్రికి లేఖ రాశారు. గ్రేటర్ హైదరాబాద్‌లో హాస్టల్ సీట్లు లభించక విద్యార్థులు కాచిగూడ, సికింద్రాబాద్ రైల్వే స్టేషన్లలో నిద్రపోతున్నారని, అక్కడే స్నానాలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బీసీ కమిషన్ కార్యాలయం నిర్లక్ష్యం మూలంగా విద్యార్థుల జీవితాలు ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. అధికారులు సమస్య తీవ్రతను ప్రభుత్వ దృష్టికి తీసుకురావడం లేదని, మహబూబ్ నగర్, నల్గొండ, వరంగల్, కరీంనగర్, ఖమ్మం, నిజామాబాద్, మెదక్ జిల్లాల నుంచి పెద్ద ఎత్తున దరఖాస్తులు పెట్టుకున్నారని తెలిపారు. సీట్లు రాక విద్యార్థులు అష్టకష్టాలు పడుతున్నారని, ముఖ్యమంత్రి జోక్యం చేసుకొని ప్రస్తుతం కొనసాగుతున్న హాస్టళ్లల్లో 20 శాతం సీట్లు పెంచాలని ఆర్ కృష్ణయ్య డిమాండ్ చేశారు.

# ఇవి తింటే రక్తహీనతకు చెక్!



రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రించడంలో వ్యాయామం కీలక పాత్ర పోషిస్తుంది. నడక, యోగా రెండూ ఈ లక్ష్యాన్ని చేరుకోగలవు. అయితే, ఏది మెరుగైనది? వాటి ప్రయోజనాలు ఏమిటి? అనే సందేహాలు సాధారణమే. ఈ రెండింటి మధ్య తేడాలు, వాటిని మీ దినచర్యలో ఎప్పుడు, ఎలా చేర్చుకోవచ్చు అన్న వివరాలను ఇప్పుడు చూద్దాం. మీ ఆరోగ్యానికి ఏది సరైనదో ఎంచుకోడానికి ఇది మీకు సహాయపడుతుంది. శరీరానికి అత్యవసరమైన పోషకాలలో ఐరన్ ఒకటి. ఇది ఎర్ర రక్త కణాల ఉత్పత్తికి, శరీరంలోని అన్ని భాగాలకు ఆక్సిజన్ రవాణాకు కీలకం. ఐరన్ లోపం వల్ల రక్తహీనత, అలసట, బలహీనత లాంటి సమస్యలు వస్తాయి. మాంసాహారులకు ఐరన్ తేలికగా లభిస్తుందని చాలామంది భావిస్తారు, కానీ శాకాహారులకు కూడా ఐరన్ పుష్కలంగా అందించే ఆహారాలు చాలా ఉన్నాయి. వాటిని మీ దైనందిన ఆహారంలో చేర్చుకుంటే, ఐరన్ లోపాన్ని సమర్థవంతంగా నివారించవచ్చు. ముఖ్యంగా, ఆకుకూరలు ఐరన్‌కు అద్భుతమైన మూలం. పాలకూర, బచ్చలికూర, మెంతికూర లాంటివి ఐరన్ తో పాటు విటమిన్లు, ఖనిజాలు కూడా అందిస్తాయి. ఇవి శరీరానికి బలాన్ని చేకూర్చి, రక్తహీనతను నివారిస్తాయి. పప్పు ధాన్యాలు కూడా ఐరన్‌తో నిండి ఉంటాయి. కందిపప్పు, పెసరపప్పు, శనగపప్పు లాంటివి ఆహారంలో చేర్చుకోవడం చాలా మంచిది. వీటిలో ఫైబర్, ప్రోటీన్లు కూడా అధికంగా ఉంటాయి. గింజలు, విత్తనాలు కూడా ఐరన్ సమృద్ధిగా అందిస్తాయి. నువ్వులు, గుమ్మడి గింజలు, చియా సీడ్స్, అవిసె గింజలు, జీడిపప్పు, బాదం లాంటి వాటిలో ఐరన్ అధికం. వీటిని స్నాక్స్ లా తినవచ్చు లేదా వంటలలో చేర్చుకోవచ్చు. చిక్కుళ్ళు కూడా మంచి ఐరన్ వనరులు. రాజ్మా, చోలే, బ్లాక్ బీన్స్ లాంటివి ఐరన్ తో పాటు ఫైబర్ ను కూడా అందిస్తాయి. వీటితో పాటు, బంగాళాదుంపలు, పుట్టగొడుగులు, డార్క్ చాక్లెట్, టోఫు (సోయా పనీర్), ఎండు పండ్లు (ముఖ్యంగా ఖర్జూరం, ఎండు ద్రాక్ష) వంటివి కూడా ఐరన్ ను అధికంగా కలిగి ఉంటాయి. ఐరన్ శరీరం శోషించుకోవడానికి విటమిన్ సి చాలా అవసరం. కాబట్టి, ఐరన్ అధికంగా ఉన్న ఆహారాలతో పాటు నిమ్మకాయ, నారింజ, ఉసిరి వంటి విటమిన్ సి ఉన్న పండ్లను ఆహారంలో చేర్చుకోవడం తెలివైన పని. ఈ శాకాహారాలను క్రమం తప్పకుండా తీసుకోవడం ద్వారా ఐరన్ లోపం బారిన పడకుండా ఆరోగ్యంగా జీవించవచ్చు.

## యువతులు పక్కాగా తెలుసుకోవాల్సినవి



యువతులకు మొదటి రుతుస్రావం (పీరియడ్) వారి జీవితంలో ఒక ముఖ్యమైన సహజ పరిణామం. ఇది 9 నుండి 16 సంవత్సరాల మధ్య ప్రారంభం అవుతుంది. ఈ సమయంలో చాలామంది అమ్మాయిలకు, తల్లిదండ్రులకు అనేక సందేహాలు, అపోహలు ఉంటాయి. ఎటువంటి భయాలు లేకుండా ఈ దశను ఎదుర్కోవడానికి, పరిశుభ్రత, ఆరోగ్య జాగ్రత్తలు, అలాగే ఎదురయ్యే శారీరక, మానసిక మార్పులపై సరైన అవగాహన కలిగి ఉండటం చాలా ముఖ్యం. యువతులకు మొదటి రుతుస్రావం, లేదా మెనార్చే, వారి జీవితంలో ఒక ముఖ్యమైన పరిణామం. ఇది సాధారణంగా 9 నుండి 16 సంవత్సరాల మధ్య ప్రారంభమవుతుంది. ప్రతి అమ్మాయి శారీరక ఎదుగుదలలో ఇదొక సహజ ప్రక్రియ. దీని గురించి సరైన అవగాహన, తప్పుడు అపోహలు లేకపోవడం చాలా ముఖ్యం. రుతుస్రావం అంటే ఏమిటి? ప్రతి నెలా గర్భాశయం గర్భధారణకు సిద్ధంగా ఉంటుంది. గర్భం రానప్పుడు, గర్భాశయం లోపలి పొర విచ్ఛిన్నమై రక్తం రూపంలో శరీరం నుండి బయటకు వస్తుంది. ఇది సాధారణంగా 2 నుండి 7 రోజుల పాటు ఉంటుంది. ఈ ప్రక్రియను రుతుస్రావం అంటారు. ప్రతి అమ్మాయికి రుతుచక్రం వేర్వేరుగా ఉంటుంది. కొంతమందికి క్రమంగా రావచ్చు. మరికొంతమందికి ప్రారంభంలో అక్రమంగా ఉండగలదు. ఇది పూర్తిగా సాధారణమే. మొదటిసారి రుతుస్రావం వచ్చినప్పుడు, కొంతమంది అమ్మాయిలు కంగారు పడవచ్చు. దీని గురించి ముందుగానే తెలుసుకోవడం వారికి ధైర్యం ఇస్తుంది. రక్తస్రావం, పొత్తికడుపు నొప్పి (పీరియడ్ క్రాంప్స్), నడుము నొప్పి, అలసట, మానసిక స్థితిలో మార్పులు వంటి లక్షణాలు సాధారణం. ఈ లక్షణాలను తగ్గించుకోవడానికి విశ్రాంతి తీసుకోవడం, వేడి పట్టీలు వాడుకోవడం, తేలికపాటి వ్యాయామాలు చేయడం సహాయపడతాయి. పరిశుభ్రత చాలా ముఖ్యం. రుతుస్రావం సమయంలో శానిటరీ ప్యాడ్‌లు, ట్యాంపూన్‌లు లేదా మెన్స్ట్రువల్ కప్‌లు వాడవచ్చు. వీటిని క్రమం తప్పకుండా మార్చడం వల్ల ఇన్ఫెక్షన్లు రాకుండా ఉంటాయి. వ్యక్తిగత పరిశుభ్రత పాటించడం ద్వారా ఆరోగ్యంగా ఉండవచ్చు. ఈ దశలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, పెద్దలు యువతులకు తగిన మద్దతు ఇవ్వాలి. వారికి సరైన సమాచారం అందించాలి. ఎటువంటి సందేహాలున్నా వైద్యులను సంప్రదించాలి. ఇది ఆరోగ్యకరమైన, ఆత్మవిశ్వాసంతో కూడిన జీవితానికి పునాది.

## అన్నం వండే ముందు బియ్యాన్ని నానబెడుతున్నారా..?



బియ్యం నానబెట్టడం వల్ల అన్నం వండటానికి చాలా తక్కువ సమయం పడుతుంది. ప్రతి బియ్యం గింజ సమానంగా ఉడికి, అన్నం అంటుకోకుండా విడివిడిగా మారుతుంది. బియ్యం మెత్తగా ఉండటం వల్ల జీర్ణం సులభంగా అవుతుంది. అందుకే బియ్యం ఎక్కువగా తినేవారు వండే ముందు నానబెట్టాలని నిపుణులు చెబుతున్నారు. అన్నం వండే ముందు కనీసం తద్వారా మన శరీరానికి మంచి పోషకాలు అందుతాయి. అంతేకాదు డయాబెటీస్ రాకుండా గ్లైసెమిక్ సూచీ కూడా తక్కువ అవుతుంది. బియ్యం ఇలా నానబెట్టడం వల్ల పోషకాలు గ్రహిస్తాయని చెబుతున్నారు. బియ్యం నానబెట్టడం వల్ల త్వరగా అన్నం ఉడుకుతుంది. మెలోటినోన్ ఉత్పత్తికి కూడా ఇది ప్రేరేపిస్తుంది తద్వారా మంచి నిద్ర పడుతుంది. కనీసం 20 నిమిషాలు అయినా వండే ముందు బియ్యం నానబెట్టాలి. తద్వారా ఖనిజాలు, విటమిన్లు కూడా నీటిలో గ్రహించబడతాయి. ఆధునిక వ్యవసాయంలో వరి సాగులో ఎన్నో రకాల పురుగుమందులు వాడుతున్నారు. కాబట్టి, అన్నం వండేముందు బియ్యం నానబెట్టి, ఆ నీటిని వడపోయడం ద్వారా బియ్యం ఉపరితలంపై అంటుకుని ఉన్న కొన్ని రసాయనాలు, దుమ్ము వంటివి తొలగిపోతాయని చెబుతున్నారు. అన్నం వండేముందు బియ్యాన్ని నానబెట్టడం వల్ల షుగర్ ఉన్నవారికి కూడా మేలు చేస్తుందని నిపుణులు చెబుతున్నారు. ఇలా నానబెట్టిన బియ్యం వల్ల రక్తంలో చక్కెర స్థాయిని కంట్రోల్‌లో ఉంచే.. ఎంజైమాటిక్ బ్రేక్‌డౌన్ ఏర్పడుతుంది. ఇది గ్లైసెమిక్ ఇండెక్స్? స్కోర్?ను తగ్గించడంలో చాలా బాగా సహాయపడుతుందని చెబుతున్నారు నిపుణులు. బియ్యం నానబెట్టి వండటం వల్ల తిన్న ఆహారం త్వరగా జీర్ణమవుతుందంటున్నారు నిపుణులు. అలాగే.. కడుపు ఉబ్బరం, అజీర్తి వంటి జీర్ణ సమస్యలు కూడా దూరం అవుతాయని చెబుతున్నారు. అంతేకాకుండా.. బియ్యాన్ని నానబెట్టడం వల్ల ఆహారంలో పోషకాల శోషణ మెరుగుపడుతుందంటున్నారు.

# రోజూ 10 నిమిషాలు వెనక్కి నడిస్తే..




సాధారణ నడక లాభదాయకం. కానీ, వెనక్కి నడవడం (రెట్రో వాకింగ్) మరింత అద్భుత ఆరోగ్య ప్రయోజనాలను అందిస్తుందని తాజా అధ్యయనాలు చెబుతున్నాయి. రోజుకు కేవలం పది నిమిషాలు వెనక్కి నడవండి, మీ శారీరక, మానసిక ఆరోగ్యం గణనీయంగా మెరుగుపడుతుంది. ఇది కీళ్ల నొప్పిని తగ్గిస్తుంది, మెదడు పనితీరును కూడా అద్భుతంగా పెంచుతుంది. రోజువారీ వ్యాయామాలలో నడక ఒక భాగం. అయితే, వెనక్కి నడవడం (రెట్రో వాకింగ్) సరికొత్త ఆరోగ్య ప్రయోజనాలను అందిస్తుందని నిపుణులు చెబుతున్నారు. ఇది కేవలం శరీరానికి మాత్రమే కాదు, మెదడుకు కూడా అనేక విధాలుగా మేలు చేస్తుందని అంటున్నారు. రోజుకు పది నిమిషాలు వెనక్కి నడవడానికి కేటాయిస్తే, ఊహించని ఆరోగ్య ప్రయోజనాలు పొందవచ్చని పరిశోధనలు వెల్లడిస్తున్నాయి. వెనక్కి నడవడం వల్ల కీళ్ళపై ఒత్తిడి తగ్గుతుంది. ముఖ్యంగా మోకాళ్ళ నొప్పితో బాధపడేవారికి ఇది చాలా ప్రయోజనకరం. ఇది కీళ్ళ చుట్టూ కండరాలను బలోపేతం చేస్తుంది. మోకాలి నొప్పిని తగ్గించగలదు. అలాగే, ఇది సమతుల్యతను (బ్యాలెన్స్) బాగా మెరుగుపరుస్తుంది. ముందుకు నడిచేటప్పుడు మనం చూస్తూ నడుస్తాం. కానీ వెనక్కి నడిచేటప్పుడు శరీరం అదనపు సమన్వయాన్ని కోరుకుంటుంది. ఇది శరీర సమతుల్య వ్యవస్థను చురుకుగా ఉంచుతుంది. వృద్ధులు తూలిపోయే ప్రమాదాన్ని తగ్గిస్తుంది. ఇది కండరాలకు కూడా చాలా మంచిది. సాధారణ నడకలో కదలిక లేని కండరాలు వెనక్కి నడిస్తే చురుకుగా మారతాయి. ముఖ్యంగా పిరుదులు, తొడ కండరాలు మరింత బలోపేతం అవుతాయి. ఇది మెదడు పనితీరును కూడా మెరుగుపరుస్తుంది. వెనక్కి నడవడం వల్ల మెదడుకు కొత్త సవాళు ్ళ ఎదురవుతాయి. ఇది జ్ఞాపకశక్తి, ఏకాగ్రత, నైపుణ్యాలను పెంపొందిస్తుంది. అంతేకాక, వెనక్కి నడవడం వల్ల కేలరీలు మరింత ఎక్కువగా ఖర్చవుతాయి. సాధారణ నడక కంటే దీనికి ఎక్కువ శక్తి అవసరం. కాబట్టి, బరువు తగ్గాలనుకునేవారికి ఇది ఒక మంచి వ్యాయామం. ఇది మానసిక ఒత్తిడిని తగ్గించి, మానసిక స్థితిని మెరుగుపరుస్తుంది. వ్యాయామం వల్ల విడుదలయ్యే ఎండార్ఫిన్లు ఒత్తిడిని తగ్గిస్తాయి. మొత్తంగా, రోజువారీ జీవితంలో వెనక్కి నడకను భాగం చేసుకుంటే, శారీరక, మానసిక ఆరోగ్యం అద్భుతంగా మెరుగుపడుతుంది. ఈ సులభమైన వ్యాయామం మన దినచర్యలో చేర్చుకుని సంపూర్ణ ఆరోగ్యాన్ని సాధించవచ్చు.

# ఈ అలవాట్లు ఉంటే వ్యాధులే దరి చేరవంట..



35 సంవత్సరాల వయస్సు తర్వాత, పురుషులలో చిరాకు, అలసట, బలహీనత, బరువు పెరగడం, ఒత్తిడి లేదా ఏకాగ్రత లేకపోవడం వంటివి వ్యాధుల వంటివి వెంటాడుతాయి.. కాబట్టి, శరీరం అలాంటి సంకేతాలను ఇస్తుంటే, జాగ్రత్తగా ఉండాలి. నేటి బిజీ లైఫ్‌స్టైల్‌లో పురుషులు తమ కెరీర్, కుటుంబం, బాధ్యతలలో మునిగిపోతారు.. వారు తమ ఆరోగ్యంపై శ్రద్ధ చూపడం మర్చిపోతారు. అది ఇంటి బాధ్యతలు అయినా.. ఆఫీసు పని ఒత్తిడి అయినా.. ఇంకే పని అయినా.. పురుషులు తమ ఆరోగ్యం కంటే ఎక్కువగా పనిపైనే దృష్టి పెడుతుంటారు.. ఇలాంటి పరిస్థితుల్లో ఏదైనా తీవ్రమైన లక్షణాలు కనిపించే వరకు ఆరోగ్యాన్ని కూడా విస్మరిస్తారు. కానీ మంచి ఆరోగ్యం దీర్ఘమైన – సంతోషకరమైన జీవితానికి పునాది అని గుర్తుంచుకోవడం చాలా ముఖ్యం. 35 సంవత్సరాల వయస్సు తర్వాత, పురుషుల శరీరంలో హార్మోన్ల మార్పులు, జీవక్రియలో క్షీణత – మానసిక ఒత్తిడి వంటి అనేక సమస్యలు పెరగడం ప్రారంభిస్తాయి. చిరాకు, అలసట, బలహీనత, బరువు పెరగడం, ఒత్తిడి లేదా ఏకాగ్రత లేకపోవడం వ్యాధుల సంకేతాలు కావచ్చు. కాబట్టి, శరీరం అలాంటి సంకేతాలను ఇస్తుంటే.. జాగ్రత్తగా ఉండాలి. చిరాకు, అలసట, బలహీనత, బరువు పెరగడం, ఒత్తిడి లేదా ఏకాగ్రత లేకపోవడం – ఇవి కేవలం బిజీ జీవితానికి సంకేతాలు మాత్రమే కాదు.. మీ జీవనశైలిలో మార్పులు చేసుకోవాల్సిన సమయం ఆసన్నమైందని అర్థం.. మీరు పెద్దయ్యాక ఫిట్‌గా ఉండటానికి అలాంటి కొన్ని అలవాట్లను మీ దినచర్యలో భాగంగా చేసుకోవాలి. అటువంటి పరిస్థితిలో, వయస్సుతో పాటు మీ ఆరోగ్యాన్ని పూర్తిగా జాగ్రత్తగా చూసుకునే కొన్ని మంచి అలవాట్లను సకాలంలో అలవర్చుకోవడం ముఖ్యం.. అంటున్నారు ఆరోగ్య నిపుణులు.. మొదటి, అతి ముఖ్యమైన అలవాటు క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం.. ప్రతిరోజూ కనీసం 30 నిమిషాలు నడవడం, జాగింగ్ చేయడం, సాగదీయడం లేదా తేలికపాటి వ్యాయామాలు చేయడం వల్ల గుండె ఆరోగ్యం, కండరాల బలం – మానసిక ప్రశాంతత పెరుగుతాయి. మీరు ఆఫీసులో గంటల తరబడి కూర్చుంటే, ఇది మరింత ముఖ్యమైనది. ఎందుకంటే శారీరక నిష్క్రియాత్మకత (కదలికలు లేకపోవడం) ఊబకాయం, అధిక రక్తపోటు, మధుమేహం ప్రమాదాన్ని పెంచుతుంది. మరో ముఖ్యమైన అలవాటు ఏమిటంటే సమతుల్య – సకాలంలో ఆహారం తీసుకోవడం.. చాలా మంది పురుషులు పని ఒత్తిడి కారణంగా సమయానికి తినరు లేదా జంక్ ఫుడ్ తో కడుపు నింపుకోరు.. దీనివల్ల శరీరానికి అవసరమైన పోషకాలు లభించవు.. ప్రోటీన్, ఫైబర్ – ఆరోగ్యకరమైన కొవ్వులు అధికంగా ఉండే అల్పాహారంతో రోజును ప్రారంభించండి. రోజంతా నీరు త్రాగండి. మీ ఆహారంలో కూరగాయలు, పండ్లు, పప్పుధాన్యాలు, గింజలను చేర్చుకోండి. మూడవ అలవాటు నిద్రకు ప్రాధాన్యత ఇవ్వడం.. నిద్ర విశ్రాంతి ఇవ్వడమే కాకుండా, శరీరాన్ని మరమ్మతు చేస్తుంది. మానసిక ఒత్తిడిని తగ్గిస్తుంది. రోగనిరోధక శక్తిని బలపరుస్తుంది. ప్రతిరోజూ కనీసం 7–8 గంటల పాటు గాఢ నిద్ర తీసుకోండి. నిద్ర కోసం ఒక నిర్దిష్ట సమయాన్ని కేటాయించడానికి ప్రయత్నించండి. మొబైల్ చూడటం లేదా రాత్రి చివరి వరకు పని చేయడం అనే అలవాటు మీ నిద్ర నాణ్యతను పాడు చేస్తుంది. నాల్గవ ముఖ్యమైన అలవాటు ఏమిటంటే ఒత్తిడిని అర్థం చేసుకోవడం మరియు దానిని సరిగ్గా నిర్వహించడం. పురుషులు తరచుగా తమ భావోద్వేగాలను అణచివేసుకుంటారు.. దీని కారణంగా లోపల ఒత్తిడి పెరుగుతూనే ఉంటుంది. దీనిని సకాలంలో ఆపకపోతే, అది అధిక రక్తపోటు, నిరాశ – గుండె జబ్బులకు కారణమవుతుంది. ఐదవ అతి ముఖ్యమైన అలవాటు ఏమిటంటే ప్రతి సంవత్సరం ఆరోగ్య తనిఖీ చేయించుకోవడం.. మీరు ఫిట్‌గా ఉన్నా లేకపోయినా, మీ రక్తపోటు, చక్కెర, కొలెస్ట్రాల్, కాలేయం – మూత్రపిండాలను సంవత్సరానికి ఒకసారి తనిఖీ చేసుకోవాలి. వ్యాధిని సకాలంలో గుర్తించడం వల్ల చికిత్స సులభతరం అవుతుంది. అనేక తీవ్రమైన సమస్యలను నివారించవచ్చు.

## బాల్యంలో భావోద్వేగ వేధింపులు.. శరీరం, మానసిక ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం



బాల్యం సంతోషంగా ఉండాలి. కానీ, భావోద్వేగ వేధింపులు పిల్లల జీవితాలపై తీవ్ర ప్రభావం చూపుతాయి. శారీరక గాయాలు లేకున్నా, ఈ వేధింపులు వారి మనస్సు, భవిష్యత్తుపై దీర్ఘకాలిక ప్రభావం చూపి, నమ్మకాన్ని దెబ్బతీస్తాయి, శరీరంతో వారి సంబంధాన్ని ప్రభావితం చేస్తాయి. ముఖ్యంగా వారి మానసిక ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపి, పెద్దయ్యాక అనేక సమస్యలకు కారణమవుతాయి. బాల్యంలో భావోద్వేగ వేధింపులు: జీవితాంతం వెంటాడే నీడ బాల్యం అమాయకత్వం, ఆనందాలతో నిండి ఉండాలి. కానీ, కొంతమంది పిల్లలు భావోద్వేగ వేధింపులకు గురవుతారు. శారీరక గాయాలు కనిపించకపోయినా, ఈ వేధింపులు వారి మనస్సుపై, భవిష్యత్తుపై తీవ్రమైన, దీర్ఘకాలిక ప్రభావాన్ని చూపుతాయి. ఇది వారి నమ్మకాన్ని దెబ్బతీసి, శరీరంతో వారి సంబంధాన్ని ప్రభావితం చేస్తుంది. ముఖ్యంగా వారి మానసిక ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపి, పెద్దయ్యాక కూడా అనేక సమస్యలకు కారణమవుతుంది. భావోద్వేగ వేధింపులు అంటే పిల్లలను తరచుగా విమర్శించడం, అవమానించడం, తిరస్కరించడం, బెదిరించడం లేదా నిర్లక్ష్యం చేయడం. తల్లిదండ్రులు లేదా సంరక్షకులు పిల్లలను తమ భావోద్వేగ అవసరాలను తీర్చకుండా నిరోధించడం కూడా ఇందులో భాగం. ఇలాంటి వాతావరణంలో పెరిగే పిల్లలు తమను తాము నిందించుకుంటారు. వారిలో ఆత్మగౌరవం తగ్గిపోతుంది. నమ్మకంపై ప్రభావం: బాల్యంలో భావోద్వేగ వేధింపులకు గురైన పిల్లలు ఇతరులను నమ్మడానికి కష్టపడతారు. వారికి భద్రతా భావం లోపిస్తుంది. సంబంధాలలో వారికి నిరంతరం అనుమానం ఉంటుంది. ఇది స్నేహాలు, కుటుంబ సంబంధాలు, భవిష్యత్తు భాగస్వామ్యాలపై ప్రతికూల ప్రభావం చూపుతుంది. వారు ఎవరినీ పూర్తిగా విశ్వసించలేరు. ఇది ఒంటరితనానికి దారి తీస్తుంది. శరీరంపై ప్రభావం: భావోద్వేగ వేధింపులు శరీరంపై కూడా ప్రభావం చూపుతాయి. ఇలాంటి అనుభవాలున్నవారు తమ శరీరాన్ని అంగీకరించలేకపోవచ్చు. వారిలో బాడీ ఇమేజ్ సమస్యలు, అనాసక్త భావన పెరుగుతాయి. కొంతమంది తమ కోపాన్ని లేదా ఒత్తిడిని నియంత్రించుకోలేక, ఆత్మహత్యా ప్రయత్నాలు లేదా స్వీయ-హానిని ఆశ్రయించవచ్చు. దీర్ఘకాలిక ఒత్తిడి శారీరక ఆరోగ్య సమస్యలకు, రోగనిరోధక శక్తి బలహీనపడటానికి కారణం కాగలదు. మానసిక ఆరోగ్యంపై ప్రభావం: డిప్రెషన్, ఆందోళన, పోస్ట్ ట్రామాటిక్ స్ట్రెస్ డిజార్డర్, వ్యక్తిత్వ లోపాలు వంటి మానసిక ఆరోగ్య సమస్యలకు బాల్యపు భావోద్వేగ వేధింపులు బలమైన కారణాలు. అలాంటి పిల్లలు పెద్దయ్యాక కూడా తమ భావోద్వేగాలను నియంత్రించుకోవడంలో ఇబ్బంది పడతారు. ఈ సమస్యలను అధిగమించడానికి థెరపీ, కౌన్సెలింగ్ చాలా అవసరం. కుటుంబ సభ్యులు, స్నేహితుల మద్దతు కూడా కీలకం. పిల్లలకు ఆరోగ్యకరమైన వాతావరణం, ప్రేమ, మద్దతు అందించడం మన సామాజిక బాధ్యత.

## మాంసంతో కలిపి తినకూడని ఫుడ్స్..!



నాన్ వెజ్ ని రుచి కోసం ఇష్టపడినా.. దానికి తగ్గట్టు సరైన ఫుడ్ కాంబినేషన్స్ ఫాలో అవ్వకపోతే డైజేషన్ ప్రాబ్లమ్స్, ఎలర్జీలు లాంటి హెల్త్ ఇష్యూస్ వచ్చే రిస్క్ ఉంది. ముఖ్యంగా కొన్ని ఫుడ్ ఐటమ్స్ ని మాంసంతో కలిపి తినడం ఆరోగ్యానికి హానికరం. మాంసాహారాన్ని రుచి కోసం ఎంతోమంది ఇష్టపడతారు. అయితే మాంసం తినేటప్పుడు ఇతర ఆహార పదార్థాలు జోడించడం వల్ల జీర్ణ సమస్యలు, అలర్జీలు లాంటి ఆరోగ్య ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉంటుంది. అటువంటి వాటిలో కొన్ని ముఖ్యమైన ఆహారాల గురించి ఇప్పుడు తెలుసుకుందాం.పాల ఉత్పత్తులు: మాంసం తిన్న తర్వాత పాలు, పెరుగు, మజ్జిగ లాంటి పాల ఆధారిత ఆహారాలు తీసుకోవడం వల్ల శరీరంలో జీర్ణ ప్రక్రియ మందగిస్తుంది. పాలు చల్లని స్వభావం కలిగి ఉంటాయి. ఇవి మాంసంలోని ప్రొటీన్లతో కలిసి అజీర్ణానికి దారితీస్తాయి. ముఖ్యంగా చేపలతో పాలు కలిపి తినడం వల్ల ఫుడ్ అలర్జీలు, తిమ్మిరి, చర్మ సంబంధిత సమస్యలు ఏర్పడే ప్రమాదం ఉంది. ఆకుకూరలు: ఆకుకూరలు పోషక విలువలతో నిండినవే అయినా.. మాంసంతో కలిపి తినడం కొన్ని సమస్యలకు దారితీస్తుంది. ముఖ్యంగా కొన్ని ఆకుకూరల్లో ఉండే ఆక్సాలిక్ ఆసిడ్.. మాంసంలోని కాల్షియంతో కలిసిపోయి శరీరానికి ఆ పోషకాలు అందకుండా చేస్తుంది. ఇది పోషక లోపాలకు దారితీస్తుంది. ఆయుర్వేదం ప్రకారం కూడా ఈ రెండు వేర్వేరు రకాల ఆహారాలు. కాబట్టి సమయం తేడాతో తినాలి.సిట్రస్ పండ్లు: నిమ్మకాయ, నారింజ, ద్రాక్ష లాంటి పుల్లని పండ్లను మాంసాహారంతో కలిపి తినడం వల్ల గ్యాస్, మంట, ఉబ్బరం లాంటి జీర్ణ సంబంధిత ఇబ్బందులు తలెత్తవచ్చు. వీటిలో ఉండే ఆమ్లాలు, మాంసంలో ఉండే ప్రొటీన్లను సరిగా జీర్ణం కాకుండా చేస్తాయి. మాంసం తిన్న తరువాత ఈ రకమైన పండ్లు తినడం వల్ల అజీర్ణ సమస్యలు ఎదురవుతాయి. తేనె: తేనెను మాంసంతో కలిపి తినడం వల్ల శరీరంలో వేడి పెరుగుతుంది. మాంసం కూడా సహజంగానే శరీరాన్ని వేడి చేస్తుంది కాబట్టి.. ఈ రెండింటి కలయికతో జీర్ణ సమస్యలు తలెత్తే అవకాశం ఉంది. అంతేకాకుండా ఆయుర్వేదం ప్రకారం.. ఈ విధంగా కలిపి తినడం విష ప్రభావానికి దారితీస్తుందని చెప్పబడింది.టీ, కాఫీ: మాంసం తిన్న వెంటనే టీ లేదా కాఫీ తాగడం చాలా మందికి అలవాటు. కానీ ఈ డ్రింక్స్ లలో ఉండే టానిన్, కెఫైన్ లాంటి పదార్థాలు మాంసంలో ఉన్న ఐరన్ ను శరీరం గ్రహించకుండా అడ్డుకుంటాయి. దీని వలన పోషక లోపాలు ఏర్పడే అవకాశముంటుంది. కాబట్టి మాంసాహారానికి ముందు లేదా కనీసం 2 గంటల విరామం తర్వాత ఈ డ్రింక్స్ తీసుకోవడం మంచిది. మాంసాన్ని ఎక్కువ నూనె, ఉప్పుతో వండడం వల్ల జీర్ణ వ్యవస్థపై అధిక భారం పడుతుంది. ఇది అజీర్ణం, ఆమ్లత్వం, మలబద్ధకం లాంటి సమస్యలకు దారితీస్తుంది. సుగంధ ద్రవ్యాలు కూడా పరిమితంగా వాడటం ఉత్తమం.

# సమాజంలో సంప్రదాయాలను భక్తిని పెంపొందించే కార్యక్రమాలు అభినందనీయం

- బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు : తోట ఆగయ్య
- ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో "దిష్టి కుంభం" పూజా కార్యక్రమం





**వేములవాడ,(ప్రశ్న న్యూస్)** వేములవాడ పట్టణంలోని ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో మహాలక్ష్మీ అమ్మవారికి దిష్టికుంభం పూజా కార్యక్రమం ఆదివారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు తోట ఆగయ్య, వేములవాడ నియోజకవర్గ ఇంచార్జి చల్మెడ లక్ష్మీ నరసింహారావు,సెస్ చైర్మన్ చిక్కాల రామారావు, సీనియర్ నేత ఏనుగు మనోహర్ రెడ్డి, మాజీ డైరెక్టర్ రామతీర్థపు రాజు,మాజీ కౌన్సిలర్లు నరాల శేఖర్, నిమ్మశెట్టి విజయ్, మారం కుమార్, నీలం శేఖర్, కందుల క్రాంతి తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా తోట ఆగయ్య మాట్లాడుతూ "సమాజంలో సాంప్రదాయాలను, భక్తిని పెంపొందించే కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయం. ఆర్యవైశ్య సంఘం నిర్వహించిన ఈ పూజా కార్యక్రమం తరగని భక్తిశ్రద్ధకు నిదర్శనమని" పేర్కొన్నారు. అలాగే ప్రజలు, ప్రజా ప్రతినిధులు కలిసి ఇలాంటి కార్యక్రమాల్లో భాగస్వామ్యం కావడం శుభపరిణామమని అన్నారు. సంఘానికి చెందిన నేతలు, యువ నాయకులు నీరటి మల్లేశం,కృపాల్,గణేష్,పోతు అనిల్,కుమార్,సందీప్, సాయి,పవన్,హరీష్,రాకేష్, శ్రీనివాస్, నాగరాజు తదితరులు కూడా కార్యక్రమంలో పాల్గొన్నారు.

# పర్యావరణ పరిరక్షణలో ముందున్న రాజన్నాలయం

- సిబ్బంది తో కలిసి మొక్కలు నాటిన ఈఓ :రాధాభాయి
- ఈఓ ఆధ్వర్యంలో ఘనంగా "వన మహోత్సవం"





**వేములవాడ,(ప్రశ్న న్యూస్)** దేవాదాయ ధర్మాదాయ శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానంలో వనమహోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి రాధాబాయి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించబడింది.ఈ సందర్భంగా దేవస్థానం పరిధిలోని గురవయ్యనగర్ సమీపంలో ఉన్న భూమిలో పలు రకాల చెట్లను నాటడం జరిగింది. పర్యావరణ పరిరక్షణలో భాగంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొని మొక్కలు నాటారు.ఈ కార్యక్రమంలో కార్యనిర్వాహక ఇంజనీర్,ఉప కార్యనిర్వాహక ఇంజనీర్, సహాయక ఇంజనీర్, సహాయ కార్యనిర్వాహణాధికారులు, పర్యవేక్షకులు సహా దేవస్థానం ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

# రాజన్న ఆలయ ఈఓ రాధాభాయి ఆకస్మిక తనిఖీలు





**వేములవాడ,(ప్రశ్న న్యూస్)** వేములవాడ శ్రీ రాజరాజేశ్వరస్వామి దేవస్థానానికి చెందిన శ్రీ లక్ష్మీ నరసింహస్వామి గోశాల,శ్రీ బద్ది పోచమ్మ ఆలయం, భీమేశ్వరసదన్ వసతి గృహాల్లో దేవస్థాన ఈఓ రాధాభాయి ఆదివారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయా విభాగాల్లో పనిచేస్తున్న సిబ్బందికి సూచనలు చేస్తూ భక్తులకు మర్యాదగా వ్యవహరించాలని,సమయ పాలన పాటించాలని సూచించారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలిగినా సంబంధిత ఉద్యోగులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.ఈ తనిఖీల్లో ఆలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

# మ్యాతరి బోనము నిర్వహించిన ఎర్ర రాజు



మహేశ్వరం (ప్రశ్న న్యూస్) మహేశ్వరం మండలం అమీర్పేట గ్రామంలో మ్యాతరి బోనము ఎర్ర రాజు నిర్వహించి ఊరేగింపు గా డప్పు వాయిద్యాల తోటి బొడ్రాయికి సమర్పించి అమ్మవారి దీవెనలు గ్రామం పైన ఉండాలని పాడిపంటలు పచ్చగా రైతులందరూ బాగుండాలని అమ్మవారి దీవెనలు తీసుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న గ్రామ పెద్దలు మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్, మాజీ సర్పంచు బస్వా శ్రీశైలం గౌడ్, మాజీ ఉప సర్పంచ్ పోతుల నర్సింగ్, మాజీ ఎంపీటీసీ కుమారి రాయప్ప, మాజీ వార్డ్ సభ్యులు బ్యాగరీ రాజు, మ్యాతర్రూల్ ఎర్ర తొంట ఈశ్వరయ్య లక్ష్మయ్య యాదయ్య ఎమ్మార్పీఎస్ గ్రామ శాఖ అధ్యక్షులు సంతోష్ కుమార్, గోపాల్ అఖిలేష్ భూపాల్ లక్ష్మీ ప్రసాద్ వంశీ ప్రదీప్ శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# ట్రాక్ రికార్డు బాగుంటేనే.?

- పవన్ అందుకే వెనకాడుతున్నారుగా.?
- అయినా అనుకున్నట్లు జరగడం లేదుగా.?



**అమరావతి (ప్రశ్న న్యూస్)** జనసేన అధినేత పవన్ కళ్యాణ్ 2014 లో పార్టీ పెట్టినా పార్టీని విస్తరించకపోవడానికి కారణం ప్రధానమైనది నేతలు పార్టీని ఇబ్బందిపెడతారనే. అందుకే ఆయన అన్ని నియోజకవర్గాల్లో ఇబ్బడి ముబ్బడిగా నేతలకు ఇన్ ఛార్జి పదవి ఇచ్చేసి జనసేన పార్టీని బలోపేతం చేయడానికి ప్రయత్నించలేదు. పార్టీ బలపడకపోయినా పరవాలేదు కానీ, నేతల వల్ల పార్టీకి, తనకు వ్యక్తిగతంగా చెడ్డపేరు రాకూడదనే గత పదేళ్ల నుంచి ఆయన ఆచితూచి నేతల విషయంలో నిర్ణయం తీసుకుంటున్నారు. తనకు నమ్మకమైన నేతలను మాత్రమే నియమించారు. అదీ తనకు సంబంధించిన వారు, దగ్గరగా ఉన్న వారు సిఫార్సు చేసిన వారికి మాత్రమే పదవులు కల్పిస్తూ నిర్ణయం తీసుకున్నారు.

### పార్టీ బలోపేతంపై..

పార్టీ పెట్టి పదేళ్లవుతున్నా జనసేన బలోపేతం పై పవన్ కల్యాణ్ దృష్టి పెట్టడం లేదని, కనీసం ఇన్ ఛార్జులను కూడా నియమించడం లేదని, పదవులను అప్పగించడం లేదన్న విమర్శలను ఆయన పెద్దగా పట్టించుకోరు. లైట్ గానే తీసుకుంటారు. పార్టీ పదవి ఇచ్చిన తర్వాత నేతలు తనకు తెలియకుండా ఏదైనాఅవినీతి ఆరోపణలను ఎదుర్కొన్నా, మరేదైనా కేసులో ఇరుక్కుంటే తన పరువు ప్రజల్లో దెబ్బతింటుందని, అందుకే తక్కువ స్థానాల్లో పోటీ చేసి అయినా పూర్తి స్థాయి విజయం సాధించి అధికారంలోకి రావాలని ఆయన తొలి నుంచి ఆలోచనలో ఉన్నారు. అందులో భాగంగానే గత ఎన్నికల సమయంలో ఎలాంటి షరతులు లేకుండా పొత్తును ప్రకటించి కేవలం 21 నియోజకవర్గాల్లోనే పోటీ చేస్తామని ప్రకటించారు.

### అందుకే పట్టించుకోకుండా..

అప్పుడు కూడా ఆయన విమర్శలు ఎదుర్కొన్నారు. 21 స్థానాలను తీసుకోవడమేంటని, జనసేన కారణంగానే కూటమి ఏర్పడిందని, అందువల్ల ఎక్కువ స్థానాలను తీసుకోవాలని పవన్ కల్యాణ్ పై పలువురు కామెంట్స్ చేసినా ఆయన పట్టించుకోలేదు. ఎమ్మెల్యేలు తక్కువగా ఉంటే వారిపై నిఘా పెట్టడంతో పాటు వారి పనితీరును ఎప్పటికప్పుడు గమనించవచ్చని, ఎక్కువ సంఖ్య అయ్యే కొద్దీ సమాచారం తెప్పించుకోవడం కూడా కష్టంగా మారుతుందని, టీడీపీ, వైసీపీలకు పోటీగా జనసేన కూడా తయారవ్వడం మినహా మరొకటి ఉండదని పవన్ కల్యాణ్ చంద్రబాబుపై పెద్దగా ఒత్తిడి తేకుండానే తనకు ఇచ్చిన సీట్లతోనే సరిపుచ్చుకుని వాటన్నింటిలో అభ్యర్థులను గెలిపించుకున్నారు.

### ఇన్ ఛార్జుల విషయంలో..

ఇక ఎమ్మెల్యేల సంగతి అలా ఉంచితే పార్టీ ఇన్ ఛార్జుల విషయంలోనూ చాలా ఆచితూచి వ్యవహరించేవారు. అలాంటిది శ్రీకాళహస్తి నియోజకవర్గం ఇన్ ఛార్జి కోటా వినుత విషయంలో తప్పుడు సమాచారం అందించారని కొందరు నేతలపై పవన్ కల్యాణ్ ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం. వినుత హత్య కేసులో ఇరుక్కుని పార్టీ పరువును దిగజార్చారని, వైసీపీకి విమర్శించడానికి అవకాశాలు కల్పించినట్లయిందని కూడా పవన్ కల్యాణ్ నేతలపై మండి పడినట్లు తెలిసింది. ఇటువంటి వారికి పదవులు ఇచ్చి తప్పు చేశామని కూడా పవన్ వ్యాఖ్యానించినట్లు సమాచారం. అందుకే పవన్ కల్యాణ్ ఇకపై పదవులు ఇచ్చే సమయంలోనూ ట్రాక్ రికార్డు చూసి మరీ ఇచ్చేందుకు మరింతగా అధ్యయనం చేయాలని నేతలకు సూచించినట్లు తెలిసింది.

# బ్లడ్ క్యాన్సర్ ప్రారంభ దశ లక్షణాలు ఎలా ఉంటాయో తెలుసా.?

- అధిక మరణాలకు కారణమయ్యే రక్త క్యాన్సర్ - ఎముక మజ్జ నుంచి అసాధారణ రీతిలో రక్త కణాల ఉత్పత్తి
- బ్లడ్ క్యాన్సర్ ను ముందుగానే గుర్తిస్తే ప్రాణాపాయం నివారణ



రక్త క్యాన్సర్, దీనిని వైద్య పరిభాషలో హెమటోలాజిక్ క్యాన్సర్ అని కూడా పిలుస్తారు, ఇది శరీరంలో ఎముక మజ్జ (బోన్ మారో) నుండి అసాధారణ రక్త కణాల ఉత్పత్తి ప్రారంభమైనప్పుడు సంభవించే ఒక తీవ్రమైన వ్యాధి. ఈ అసాధారణ కణాలు సాధారణ రక్త కణాల పనితీరును దెబ్బతీస్తాయి, తద్వారా తీవ్రమైన ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయి. రక్త క్యాన్సర్‌ను ముందుగానే గుర్తించడం చికిత్స విజయానికి, రోగి ప్రాణాలను కాపాడటానికి అత్యంత కీలకమని వైద్య నిపుణులు నొక్కి చెబుతున్నారు. ప్రారంభ దశలో లక్షణాలు అస్పష్టంగా ఉండవచ్చు, కానీ వాటిని విస్మరించకుండా నిశితంగా పరిశీలించడం అవసరం.

### కీలకమైన తొలి సంకేతాలు మరియు లక్షణాలు

తీవ్రమైన అలసట మరియు శ్వాస ఆడకపోవడం: విశ్రాంతి తీసుకున్న తర్వాత కూడా తరచుగా బలహీనంగా, అలసిపోయినట్లు అనిపించడం, చిన్నపాటి పనులకే ఆయాసం రావడం రక్త క్యాన్సర్ యొక్క ఒక ప్రధాన లక్షణం. ఇది రక్తహీనత (తక్కువ ఎర్ర రక్త కణాల సంఖ్య) కారణంగా సంభవిస్తుంది, ఇది లుకేమియా లేదా లింఫోమా వంటి రక్త క్యాన్సర్‌లలో సాధారణం. శరీర కణాలకు తగినంత ఆక్సిజన్ అందకపోవడం వల్ల ఈ అలసట, శ్వాస ఆడకపోవడం వంటివి కలుగుతాయి.

వాపుకు గురైన శోషరస గ్రంథులు మరియు తరచుగా వచ్చే అంటువ్యాధులు: మెడ, చంకలు లేదా గజ్జల్లో వాపుకు గురైన, నొప్పి లేని శోషరస గ్రంథులు (లింఫ్ నోడ్స్) గమనించినట్లయితే, అది లింఫోమా లేదా లుకేమియాకు సూచన కావచ్చు. క్యాన్సర్ రక్త కణాల అసాధారణ పెరుగుదల రోగనిరోధక వ్యవస్థను బలహీనపరుస్తుంది. దీని ఫలితంగా తరచుగా జలుబు, ఫ్లూ, చిగుళ్ళ వాపు లేదా ఇతర అంటువ్యాధులు వస్తాయి. సాధారణ చికిత్సలకు కూడా ఇవి త్వరగా తగ్గకపోవచ్చు.

ఎముక మరియు కీళ్ల నొప్పి: ఎముకలలో లేదా కీళ్ళలో నిరంతర నొప్పి కూడా రక్త క్యాన్సర్ లక్షణం కావచ్చు. లుకేమియా వంటి కొన్ని రకాల రక్త క్యాన్సర్‌లు ఎముక మజ్జలో కణాల అసాధారణ పెరుగుదలకు దారితీస్తాయి, దీనివల్ల ఎముకల లోపల ఒత్తిడి పెరిగి నొప్పి వస్తుంది. క్యాన్సర్ శరీరంలోని ఇతర భాగాలకు వ్యాపించినట్లయితే కూడా ఈ నొప్పి కలగవచ్చు.

రాత్రిపూట తీవ్రమైన చెమటలు మరియు నిరంతర జ్వరం: ఎటువంటి స్పష్టమైన కారణం లేకుండా, ముఖ్యంగా రాత్రి నిద్రపోతున్నప్పుడు తీవ్రమైన చెమటలు పట్టడం లింఫోమా లేదా లుకేమియా వంటి రక్త క్యాన్సర్‌లకు ఒక ముఖ్యమైన లక్షణం. అలాగే, తరచుగా, దీర్ఘకాలం పాటు కొనసాగే జ్వరాలు కూడా క్యాన్సర్ వల్ల రోగనిరోధక వ్యవస్థ ప్రభావితం అయినప్పుడు సంభవించవచ్చు.

కాలేయం లేదా ప్లీహము పెరగడం (హెపాటోస్ప్లెనోమెగాలీ): కడుపులో పై భాగంలో అసౌకర్యం లేదా నిండుగా ఉన్నట్లు అనిపించడం, ఉదర భాగంలో వాపు గమనించినట్లయితే, అది కాలేయం లేదా ప్లీహము పెరగడం వల్ల కావచ్చు. ఈ అవయవాలు రక్త కణాల ఉత్పత్తి మరియు వడపోతలో కీలక పాత్ర పోషిస్తాయి. రక్త క్యాన్సర్, ముఖ్యంగా లుకేమియా లేదా లింఫోమా, ఈ అవయవాలలో అసాధారణ కణాలు పేరుకుపోవడానికి దారితీస్తుంది.

కారణం లేకుండానే బరువు తగ్గడం: ఆహారపు అలవాట్లలో మార్పులు లేకుండా లేదా వ్యాయామం చేయకుండానే, గణనీయంగా బరువు తగ్గడం క్యాన్సర్ యొక్క సాధారణ లక్షణం. క్యాన్సర్ కణాలు శరీర జీవక్రియను వేగవంతం చేస్తాయి మరియు రోగి యొక్క ఆకలిని తగ్గిస్తాయి, దీనివల్ల బరువు తగ్గుతారు.

అసాధారణమైన గాయాలు లేదా రక్తస్రావం: శరీరంపై సులభంగా గాయాలు ఏర్పడటం, చిగుళ్ళ నుండి రక్తస్రావం, చిన్న ఎర్రటి మచ్చలు (పెటేకియా), తరచుగా ముక్కు నుండి రక్తస్రావం, లేదా మహిళల్లో అధిక ఋతుస్రావం వంటివి రక్త క్యాన్సర్‌కు సూచనలు కావచ్చు. ఇవి సాధారణంగా తక్కువ ప్లేట్‌లెట్ల సంఖ్య (రక్తం గడ్డకట్టడానికి సహాయపడే కణాలు) లేదా రక్తం గడ్డకట్టే సమస్యల వల్ల సంభవిస్తాయి.

పైన పేర్కొన్న లక్షణాలలో ఏవైనా ఒకటి లేదా అంతకంటే ఎక్కువ మీరు నిరంతరంగా గమనించినట్లయితే, ఆందోళన చెందకుండా వెంటనే ఆరోగ్య నిపుణులను సంప్రదించడం చాలా అవసరం.

ఈ లక్షణాలు కేవలం రక్త క్యాన్సర్‌కే పరిమితం కావు, ఇతర సాధారణ ఆరోగ్య సమస్యలకు కూడా సూచనలు కావచ్చు. అయినప్పటికీ, సరైన మూల్యాంకనం, పరీక్షలు మరియు సకాలంలో నిర్ధారణ ద్వారా మాత్రమే సరైన చికిత్సను ప్రారంభించి, మెరుగైన ఫలితాలను పొందవచ్చు. మీ ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించండి మరియు అనుమానాస్పద లక్షణాలను ఎప్పుడూ విస్మరించవద్దు.


**(NOTE: ఇంటర్నెట్‌లో సేకరించిన సమాచారం ఆధారంగా ఈ వివరాలు మీకు అందించటం జరిగింది. ఇందులోని అంశాలు కేవలం అవగాహన కోసం మాత్రమే. తదుపరి జరిగే ఎలాంటి పరిణామాలకు ప్రజాప్రశ్న పత్రిక బాధ్యత వహించదు)**



## ఆన్‌లైన్ షాపింగ్‌లో మోసపోయిన
# నటి అనసూయ

ప్రముఖ నటి అనసూయ భరద్వాజ్ ఆన్‌లైన్ షాపింగ్‌లో మోసపోయింది. 'ట్రఫుల్ ఇండియా' అనే ఆన్‌లైన్ క్లాతింగ్ వెబ్‌సైట్ ద్వారా కొన్ని దుస్తులను ఆర్డర్ చేసింది ఈ అమ్మడు. వీటికి ముందుగానే డబ్బులు చెల్లించింది. అయితే ఆర్డర్ పెట్టి నెల రోజులు గడుస్తున్నా ఇంకా డెలివరీ అవ్వకపోవడంతో పాటు రీఫండ్ కూడా రాకపోవడం పట్ల అనసూయ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది.ఇది దోపిడీతో సమానం అని పేర్కొన్న అనసూయ.. ఇలాంటి ఆన్‌లైన్ సంస్థలను నమ్మవద్దని, వస్తువులను కొనుగోలు చేయవద్దని ప్రజలను హెచ్చరించింది. తనలా ఎవరూ మోసపోకూడదనే ఉద్దేశ్యంతోనే ఈ విషయాన్ని పంచుకున్నట్లు ఆమె తెలిపారు.

## చెన్నైలో ప్రేమకథ



సంతోష్ శోభన్, మానస వారణాసి జంటగా నటిస్తున్న చిత్రం 'కపుల్‌ఫ్రెండ్లీ'. అశ్విన్‌చంద్రశేఖర్ దర్శకుడు. తెలుగుత, తమిళ భాషల్లో యూవీ కాన్సెప్ట్స్ సంస్థ నిర్మిస్తున్నది. సంగీతప్రధాన ప్రేమకథా చిత్రమిది. శనివారం హీరో సంతోష్‌శోభన్ పుట్టినరోజు సందర్భంగా స్పెషల్ పోస్టర్‌ను విడుదల చేశారు.చెన్నై నేపథ్యంలో కథ సాగుతుందని, సంతోష్‌శోభన్ మధ్యతరగతి తెలుగు అబ్బాయిగా కనిపిస్తారని..త్వరలో తెలుగు, తమిళ భాషల్లో విడుదల చేస్తామని మేకర్స్ తెలిపారు. ఈ చిత్రానికి కెమెరా: దినేష్ పురుషోత్తమన్, సంగీతం: ఆదిత్య రవీంద్రన్, రచన-దర్శకత్వం: అశ్విన్ చంద్రశేఖర్.

## మనందరికీ వ్యక్తిగతంగా తీరని లోటు..
# కోట మృతి పట్ల మోహన్ బాబు సంతాపం





తనదైన విలనిజంతో భయపెట్టిస్తూనే.. మరోవైపు క్యారెక్టర్ ఆర్టిస్టుగా తెలుగు ప్రేక్షకుల్లో చెరగని ముద్ర వేసుకున్నారు ప్రముఖ సినీ నటుడు కోటా శ్రీనివాసరావు . గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన 83 ఏండ్ల వయసులో ఆదివారం తెల్లవారుజామున 4 గంటలకు ఫిల్మ్‌నగర్‌లోని తన నివాసంలో తుదిశ్వాస విడిచారని తెలిసిందే. ఈ నేపథ్యంలో సినీ ప్రముఖులు ఇప్పటికే తమ సంతాప సందేశాన్ని తెలియజేశారు.నటుడు మోహన్ బాబు కోట మృతి పట్ల సంతాపం ప్రకటించారు. కోట శ్రీనివాసరావుగారు మరణించారని తెలిసిన తర్వాత చాలా బాధపడ్డాను. ఆయనను చూస్తూ, ఆయన నుండి నేర్చుకుంటూ పెరిగిన మనందరికీ ఈ నష్టం వ్యక్తిగతంగా తీరని లోటని అనిపిస్తుంది. కోట శ్రీనివాస రావు ఆత్మకు శాంతి చేకూరాలి. ఆయన కుటుంబానికి మనోధైర్యాన్ని ఇవ్వాలని ఆ దేవుడిని ప్రార్థిస్తున్నానంటూ ఎక్స్‌లో ట్వీట్ చేశాడు.

## పాత్ర ఏదైనా సరే వంద శాతం
# న్యాయం చేసిన కోట..
### వారు లేని లోటుని భర్తీ చేశాడు!



తెలుగు సినిమా రంగంలో తాను చేయని పాత్రలే లేనన్నట్టుగా, కోట శ్రీనివాసరావు నటించిన ప్రతి క్యారెక్టర్‌కి జీవం పోశారు. కమెడియన్‌గా , విలన్ గా, ఫాదర్, తాత, అవినీతి నేత ఇలా ఏ పాత్రనైనా అవలీలగా పోషించిన కోటా అనేక తరాల తెలుగు ప్రేక్షకులను మెప్పించారు. దాదాపు 750కి పైగా చిత్రాల్లో నటించిన ఆయన, తన ప్రతిభతో ప్రతి సినిమాలోనూ ప్రత్యేకమైన గుర్తింపు పొందారు. తొలుత హైదరాబాద్‌లో స్టేట్ బ్యాంకులో ఉద్యోగం చేస్తున్న కోట సినిమాలపై ఉన్న మక్కువతో ఇండస్ట్రీలోకి అడుగుపెట్టారు. 1978లో 'ప్రాణం ఖరీదు' చిత్రంతో సినీ రంగ ప్రవేశం చేసిన ఆయన, 1983లో జంధ్యాల దర్శకత్వంలో వచ్చిన 'అమరజీవి' లో నటించి మరింత గుర్తింపు పొందారు. ఆ తరువాత నుంచి వెనుదిరిగి చూడలేదు. ఎస్వీఆర్, రావు గోపాలరావు, కైకాల సత్యనారాయణ శకం ముగిసిన తర్వాత ఆ లోటును భర్తీ చేశారు కోట.'డబ్బు ఖర్చు సబ్బు ఖర్చు నీళ్ల ఖర్చు' అనే డైలాగ్‌తో గుర్తొచ్చే లక్ష్మీపతి పాత్ర కోట నటనకు ఒక మైలురాయి. 'అహ నా పెళ్లంట సినిమాలో ఆయన పోషించిన పిసినారి పాత్ర ఇప్పటికీ తెలుగు ప్రేక్షకులకు నవ్వులు పంచుతోంది. అదే తరహా పాత్రను ఆయన 'ఆమె', 'ఆ నలుగురు' వంటి చిత్రాల్లోనూ చేసి మెప్పించారు. 1985లో వచ్చిన 'ప్రతిఘటన' చిత్రంలో ఆయన పోషించిన మంత్రి కాశయ్య పాత్ర, కోటాని ఓ స్టార్ చేసింది. "నమస్తే తమ్మీ!" అంటూ తెలంగాణ యాసతో మాట్లాడే అవినీతి మంత్రిగా ఆయన నటన, ప్రేక్షకుల గుండెల్లో నిలిచిపోయింది. 'గణేష్' చిత్రంలో "సాంబశివుడురా నా పేరు" అంటూ గుండుతో, లెన్స్‌తో, దుర్మార్గమైన ఆరోగ్య మంత్రిగా ఆయన చేసిన నటన చూస్తే గుండెల్లో వణుకు పుట్టేది. అదే తరహా సీరియస్ షేడ్స్‌ను ఆయన 'గాయం' సినిమాలో 'గద్దెతే నేను ఖండిస్తున్న' అనే డైలాగ్‌తో మరో స్థాయికి తీసుకెళ్లారు. ఇవన్నీ సోషల్ మీడియాలో ఇప్పటికీ వైరల్ అవుతూనే ఉంటాయి. 'హలో బ్రదర్'లో తాడిమట్టయ్య, 'మనీ మనీ'లో బట్లర్ ఇంగ్లీష్ మాట్లాడే తికమక క్యారెక్టర్‌లు ప్రేక్షకులకు ఇప్పటికీ నవ్వులు తెస్తాయి. బాబు మోహన్‌తో కలిసి చేసిన కామెడీ సీన్లు మరొక లెవెల్ అన్నట్టుగా ఉంటాయి. కోట నటనలో హాస్యం ఒక్కటే కాదు%ా% భావోద్వేగం కూడా ఉంటుంది. 'ఇంట్లో ఇల్లాలు వంటింట్లో ప్రియురాలు'లో అల్లరి తాతగా, 'బొమ్మరిల్లు', 'ఆడవారి మాటలకు అర్థాలే వేరులే', 'గబ్బర్ సింగ్' వంటి చిత్రాల్లో మధ్యతరగతి తండ్రిగా ఆయన చేసిన పాత్రలు ప్రేక్షకులకు దగ్గరయ్యాయి.తెలుగు సినిమాలతోపాటు, ఇతర భాషల్లోనూ కోటా నటించి మంచి గుర్తింపు సంపాదించారు. మల్టీ డైమెన్షనల్ నటనతో ఆయన ఒక తెలుగు సినిమా చరిత్రలో నిలిచిపోయిన అధ్యాయంగా మిగిలారు. కోట మరణించిన కూడా ఆయన పోషించిన పాత్రలు, పలికించిన డైలాగులు, చూపించిన హావభావాలు తెలుగు ప్రేక్షకుల మనసుల్లో చిరకాలం నిలిచిపోతాయి.

# బ్యాంక్ దోపిడీ నేపథ్యంలో..




దీక్షిత్‌శెట్టి హీరోగా నటిస్తున్న తెలుగు, కన్నడ ద్విభాషా చిత్రం 'బ్యాంక్ ఆఫ్ భాగ్యలక్ష్మి'. అభిషేక్ ఎమ్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని శ్రీదేవి ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై హెచ్.కె.ప్రకాష్ నిర్మిస్తున్నారు. క్రైమ్ కామెడీగా తెరకెక్కిస్తున్న ఈ సినిమా టీజర్‌ను శనివారం విడుదల చేశారు. బ్యాంక్ దోపిడికి వెళ్లిని హీరో గ్యాంగ్‌కి అక్కడ కేవలం 67వేల రూపాయలు మాత్రమే దొరుకుతాయి.

ఆ తర్వాత వారికి ఎలాంటి పరిస్థితులు ఎదురయ్యాయనే అంశాలతో టీజర్ వినోదప్రధానంగా సాగింది. క్రైమ్ కామెడీ థ్రిల్లర్ ఇదని, చక్కటి వినోదంతో సాగుతూ థ్రిల్‌ని పంచుతుందని మేకర్స్ తెలిపారు. బృందా ఆచార్య గోపాల్‌కృష్ణ దేశ్‌పాండే, సాధు కోకిల, శృతి హరిహరన్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: జుధాన్ శ్యాండీ, రచన-దర్శకత్వం: అభిషేక్ ఎమ్.

# ప్రేమను ఎందుకు వద్దనుకున్నాడు?



మురళీ కృష్ణంరాజు, శృతి శెట్టి జంటగా నటిస్తున్న ఫీల్‌గుడ్ రొమాంటిక్ ఎంటర్‌టైనర్ 'స్కై'. పృథ్వీ పెరిచర్ల స్వీయ దర్శకత్వంలో నాగిరెడ్డి గుంటక, శ్రీలక్ష్మీ గుంటక, మురళీ కృష్ణంరాజుతో కలిసి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. త్వరలో ఈ చిత్రం థియేటర్లలో విడుదల కానుంది. ప్రమోషన్‌లో భాగంగా శనివారం ఈ సినిమా టీజర్‌ని మేకర్స్ విడుదల చేశారు.మనీ ట్రాన్సాక్షన్‌లో జరిగిన మిస్టేక్ వల్ల హీరోహీరోయిన్ల మధ్య బాండింగ్ ఏర్పడటం ఈ టీజర్‌లో ఆసక్తికరమైన అంశం. హీరో విక్కీ తను అనుకున్న రెస్టారెంట్ బిజినెస్‌లో సక్సెస్ అయ్యాడా? హీరోయిన్ ప్రేమను విక్కీ ఎందుకు వద్దనుకున్నాడు? తన తండ్రికి సంబంధించి విక్కీకి ఉన్న గతమేంటి?ఈ ప్రశ్నలతో క్యూరియాసిటీని క్రియేట్ చేస్తూ టీజర్ సాగింది. ఆనంద్ భారతి, రాకేష్ మాస్టర్, తదితరులు ఇతర పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: రసూల్ ఎల్లోర్, సంగీతం: శివప్రసాద్, నిర్మాణం: వేలార్ ఎంటర్‌టైన్మెంట్స్.

## కోట శ్రీనివాసరావు మృతితో కన్నీరు పెట్టుకున్న బాబు మోహన్



విలక్షణ నటుడు కోట శ్రీనివాసరావు ఈ రోజు తెల్లవారుజామున అనారోగ్యంతో కన్నుమూశారు. విలన్‌గా, క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా, కమెడియన్‌గా ఎన్నో విలక్షణ పాత్రలు పోషించిన ఆయన ఎంతో మంది ప్రేక్షకుల మనసులు గెలుచుకున్నాడు. తెలుగు సినిమా కామెడీ చరిత్రలో ఎనలేని కాంబినేషన్ అంటే కోట శ్రీనివాసరావు, బాబు మోహన్‌లది. ఈ ఇద్దరు నటుల జోడీ తెరపై కనిపిస్తే చాలు, నవ్వుల పంట పండేది. అప్పట్లో వీరిద్దరూ కలిసి సినిమా చేస్తే ప్రేక్షకులలో ఓ ప్రత్యేకమైన ఆసక్తి ఉండేది. కామెడీకి కొత్త దారులు చూపిన ఈ కాంబినేషన్ ఎన్నో హిట్ చిత్రాలకు సాక్ష్యమైంది.కోట శ్రీనివాసరావు - బాబు మోహన్ కలసి దాదాపు 60కి పైగా సినిమాల్లో నటించారు. కోట గారి గంభీరమైన డైలాగ్ డెలివరీ, విలక్షణమైన హావభావాలు, మరోవైపు బాబు మోహన్ అమాయకపు మానరిజంతో కూడిన టైమింగ్ కామెడీ ప్రేక్షకులని కడుపుబ్బ నవ్వించేలా చేసేవి. దర్శకులు, నిర్మాతలు వీరిద్దరినీ తమ సినిమాల్లో తప్పకుండా తీసుకునే వారు. వీరి కామెడీ ట్రాక్స్ ప్రేక్షకుల మదిలో నిలిచిపోయాయి. తెరపై వారి మధ్య కెమిస్ట్రీ అద్భుతంగా పని చేసేది. దాసరి నారాయణరావు దర్శకత్వంలో వచ్చిన మామగారు సినిమాలో వీరి కామెడీ ప్రేక్షకులను ఆకట్టుకుంది సురేష్ ప్రొడక్షన్స్ నిర్మించిన ప్రేమ విజేత చిత్రంలో వీరి సంభాషణలు బాగా పాపులర్ అయ్యాయి. సీతారత్నం గారి అబ్బాయి సినిమాలో కామెడీ సన్నివేశాలు నవ్వుల పంట పండించాయి. అహ నా పెళ్ళంట చిత్రంలో బాబు మోహన్ కనిపించకపోయినప్పటికీ, కోట శ్రీనివాసరావు పోషించిన పిసినిగొట్టు లక్ష్మీపతి పాత్ర తెలుగు సినిమా కామెడీలో ఒక ఐకానిక్ క్యారెక్టర్‌గా నిలిచిపోయింది. కోట శ్రీనివాసరావు - బాబు మోహన్ జంట తెలుగు సినిమా హాస్యానికి ఒక ప్రత్యేక అధ్యాయాన్ని అందించింది. ఇప్పుడు కోట తనని వదిలి వెళ్లారని తెలిసి భావోద్వేగానికి గురయ్యారు బాబు మోహన్. కోట మరణం బాధాకరం.

నిన్న రాత్రి కూడా ఆయనతో మాట్లాడాను.కోట మరణ వార్త నన్ను దిగ్భ్రాంతికి గురి చేసింది అని కన్నీరు పెట్టుకున్నారు బాబు మోహన్. ఇక కోట మరణ వార్త తెలుసు కున్న చాలా మంది సినిమా ప్రముఖులు షూటింగ్ క్యాన్సిల్ చేసుకొని ఆయనకు నివాళులు అర్పించేందుకు హైదరాబాద్‌కి వస్తున్నారు.

## తెలంగాణ యాసపై మక్కువ..
### కోట శ్రీనివాసరావుకు గుర్తింపు తెచ్చిన డైలాగ్‌లు..



తెలుగు సినిమాల్లో తెలంగాణ యాసను చాలా అరుదుగా వినియోగించేవారు. అదీ విలన్, కమెడియన్ క్యారెక్టర్లకు మాత్రమే మన యాసను వాడేవారు. అయితే తెలంగాణ యాసపై ఆసక్తి పెంచుకున్న కోట శ్రీనివాసరావు ఆ పదాలను ఎలా పలకాలో నేర్చుకుని మరీ సినిమాల్లో డైలాగులు చెప్పారు. కృష్ణా జిల్లాలో జన్మించిన ఆయన మొదట్లో ఆ ప్రాంత యాసలోనే సినిమాలు చేశారు. అయితే ఓసారి హైదరాబాద్ వచ్చిన ఆయనకు తెలంగాణ యాస ముఖ్యంగా హైదరాబాద్ లో తెలుగు బాగా నచ్చింది. దీంతో తెలంగాణ యాసపై మక్కువ పెంచుకున్న ఆయన 1985లో ప్రతిఘటన సినిమాలో తొలిసారి మన యాసలో డైలాగులు చెప్పారు. అది అందరినీ ఆకట్టుకోవడంతో రాత్రికి రాత్రే ఆయనకు స్టార్‌డమ్ వచ్చింది. దీంతో తెలంగాణ ప్రజలకు కోట మరింత దగ్గరయ్యారు. ఆయన విలన్‌గా చేసిన చాలా పాత్రల్లో యాస.. నైజాందే ఉంటుంది. అరే భయ్, ఏందిరా భయ్, మస్తు ఉంది, పరేషాన్ నై ఇలాంటి పదాలు బాగా ఆకట్టుకున్నాయి.కాగా, గత కొతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న కోట శ్రీనివాసరావు ఆదివారం తెల్లవారుజామున 4 గంటలకు కన్నుమూశారు. ఫిలింనగర్‌లోని తన నివాసంలో తుదిశ్వాస విడిచారు. మధ్యాహ్నం 3.30 గంటలకు మహాప్రస్థానంలో ఆయన అంత్యక్రియలు జరుగనున్నాయి.

## కార్మికుల సంక్షేమానికి కృషి చేస్తా:- కావలి భాస్కర్



**మేడ్చల్( ప్రశ్న న్యూస్)** కార్మికుల సంక్షేమానికి కృషి చేస్తానని గుండ్లపోచంపల్లి పురపాలక సంఘం కార్మిక విభాగం అధ్యక్షుడు కావలి భాస్కర్ అన్నారు. ఆదివారం జిల్లా కార్మిక విభాగం అధ్యక్షుడు కందాడి సుదర్శన్ రెడ్డి చేతుల మీదుగా కావలి భాస్కర్ ముదిరాజ్ ను గుండ్లపోచంపల్లి పురపాలక సంఘం కార్మిక విభాగం అధ్యక్షుడిగా నియమిస్తూ నియామక పత్రాన్ని అందజేసుశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనపై నమ్మకంతో ఈ భాధ్యతను అందజేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర, జిల్లా నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. జిల్లాలో కార్మికుల సమస్యలపై పోరాటం చేస్తూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో పురపాలక సంఘం అధ్యక్షుడు మాజీ జడ్పిటిసి సాయిపేట శ్రీనివాస్, జిల్లా ఉపాధ్యక్షుడు సంపత్ గౌడ్, మేడ్చల్ అసెంబ్లీ లేబర్ సెల్ ఇంచార్జి సాయిపేట మల్లేష్, వినోద్, ఉదయ్ గౌడ్, మలిగే కిషన్, బండారి వెంకట్, శివాజీ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల సమస్యలను పట్టించుకోని ఎమ్మెల్యే

- చామకూర మల్లారెడ్డి : బచ్చు కృష్ణప్రియ మల్లారెడ్డి
- ఎమ్మెల్యేగా బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి నేటి వరకు ఇసుమంతైన అభివృద్ధి జరగలేదని ఆరోపణ
- మేడ్చల్, గుండ్ల పోచంపల్లి, ఎల్లంపేట పురపాలక సంఘం పరిధిలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పట్టించుకోవాలని విన్నపం



**మేడ్చల్ (ప్రశ్న న్యూస్)** మేడ్చల్ నియోజకవర్గ ఎమ్మెల్యేగా గెలుపొందిన చామకూర మల్లారెడ్డి ఎమ్మెల్యేగా పదవి బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి నేటి వరకు తన నియోజకవర్గంలోని ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పట్టించుకున్న పాపను పోవడం లేదని భారతీయ జనతా పార్టీ మహిళా నాయకురాలు, జడ్పీటీసీ కంటెస్టెంట్ అభ్యర్థి బచ్చు కృష్ణప్రియ మల్లారెడ్డి అన్నారు. మేడ్చల్ పురపాలక సంఘం, గుండ్ల పోచంపల్లి పురపాలక సంఘం, ఎల్లంపేట పురపాలక సంఘం పరిధిలోని ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పట్టించుకున్న పాపాన పోలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆయా పురపాలక సంఘాల పరిధిలోని వార్డులలో ఎమ్మెల్యేగా బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి నేటి వరకు ఇసుమంతైన అభివృద్ధి జరగలేదని ఆరోపించారు. ప్రస్తుత వర్షాకాలం సమయంలో డ్రైనేజీలు నిండిపోయి రోడ్లపై ప్రవహిస్తున్న మురుగునీటిని సరి చేయించాలన్నారు. చాలా చోట్లల్లో వీధి దీపాలు కూడా సరిగ్గా లేవు చీకట్లో ప్రజలకు ఎంతో ఇబ్బంది అవుతుందని ఇలా చెప్పుకుంటూ పోతే చామకూర మల్లారెడ్డికి ఓట్లేసి గెలిపించిన ప్రజలు(ఓటర్లు) నిత్యం ఎన్నో సమస్యలు అనుభవిస్తున్నారు. ఎన్నికల సమయంలో కనిపించిన ఎమ్మెల్యే మల్లారెడ్డి ఇప్పుడు ఎందుకని ప్రజల మధ్యన కనిపించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. గెలిచాను ఇంకా కనబడనవసరం లేదు అని అనుకుంటున్నాడా...? అని విమర్శించారు. ప్రజల మధ్య ఉంటూ, ఎక్కడ ఇక్కడ ఏ సమస్యలు ఎదుర్కొంటున్నారని ఆయా కాలనీలలో పర్యటిస్తూ ప్రజల సమస్యలు దగ్గరుండి తెలుసుకుని సమస్యలు పరిష్కరించాల్సిన మల్లారెడ్డి మర్చిపోయిన కనిపించడం లేదన్నారు. నిత్యం ప్రజలకే సేవ చేయాల్సిన బాధ్యత గల ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి ఇప్పటికైనా వెంటనే ఓట్లేసి గెలిపించిన ప్రజల మధ్య ఉంటూ వర్షాకాలంలో ప్రజలు ఎదుర్కొనే సమస్యలను పరిష్కరించేందుకు అధికారులతో చర్చించి సమస్యలను పరిష్కరించాలని కోరారు.

## ఎఫ్ టి పి సి మీడియా డైరెక్టర్‌గా చంద్రశేఖర్

- ముఖ్య అతిథిగా నోముల ప్రకాష్, బాలీవుడ్ ప్రముఖులు



**సికింద్రాబాద్( ప్రశ్న న్యూస్)** సికింద్రాబాద్ సీతాఫల్మండికి చెందిన చంద్రశేఖర్ (మున్నూరు చందు)ను ఫిలిం అండ్ టెలివిజన్ ప్రమోషన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (ఎఫ్‌టిపిసి) తెలంగాణ రాష్ట్ర మీడియా డైరెక్టర్‌గా శనివారం బషీర్బాగ్ ప్రెస్ క్లబ్‌లో నియమించారు. ఈ కార్యక్రమంలో ఎఫ్‌టిపిసి జాతీయ అధ్యక్షుడు చైతన్య జంగా, ప్రధాన కార్యదర్శి వర్మ, తెలంగాణ చైర్మన్ కిరణ్ బేజారి, కళ్యాణ వెంకటేశ్వర స్వామి దేవస్థానం ఫౌండర్ అండ్ చైర్మన్ నోముల ప్రకాష్ చేతుల మీదుగా చంద్రశేఖర్‌కు నియామక పత్రం అందజేయబడింది. ఈ కార్యక్రమానికి బాలీవుడ్ నటి పూజా గంగూలీ, సినీ నటుడు శుభోదయం సుధాకర్, గాయనులు అస్మిత, రోజా భారతి, బుల్లితెర నటులు కవిత తదితరులు అతిథులుగా హాజరయ్యారు. నూతన మీడియా డైరెక్టర్ చంద్రశేఖర్‌ను శాలువాలతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎఫ్‌టిపిసి తెలంగాణ చైర్మన్ కిరణ్ బేజారి మాట్లాడుతూ “ఎఫ్‌టిపిసి ఇండియా రాష్ట్రంతో పాటు దేశవ్యాప్తంగా సినీ రంగం, బుల్లితెర, మీడియా రంగాల్లో ఆసక్తి ఉన్న యువతకు అనేక అవకాశాలు కల్పించేందుకు కృషి చేస్తాం” అని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో న్యూస్ యాంకర్ ప్రతిభ, జర్నలిస్టు సంఘం అధ్యక్షుడు సత్యం రాంపల్లి, బీజేపీ మహిళా మోర్చా నాయకురాలు భానుమతి, యాంకర్ ఉమామహేశ్వరి తదితరులు పాల్గొని ఎఫ్‌టిపిసి ఇండియా కమిటీకి అభినందనలు తెలిపారు.

# దయానియ స్థితిలో వికలాంగుడు

## - ప్రభుత్వం ఆదుకోవాలని వేడుకోలు...



**మంథని( ప్రశ్న న్యూస్)** ప్రభుత్వం నుండి ఎలాంటి సహాయం అందక దిక్కు తోచని స్థితిలో మంథని అంబేద్కర్ ప్రధాన చౌరస్తాలో బిక్షటన చేస్తూన్న ఓ వికలాంగుడు ఫొటో దిశ కెమెరా కు చిక్కింది. తను దుర్భర జీవనాన్ని కొనసాగిస్తున్నట్లు తెలిపాడు. మంథని మండలం నాగారం గ్రామానికి చెందిన కన్నూరి ఓదెలు ఓ ప్రమాదంలో తన కుడి కాలును కోల్పోయాడు. దింతో దిక్కు తోచని స్థితిలో ఉన్నాడు. తన రోజు వారి జీవనం కొరకు బిక్షటన చేసుకుంటూన్నాడు. వృద్ధురాలు అయిన తన తల్లి వద్ద ఉంటూ... జీవనాన్ని కొనసాగిస్తున్నాడు. ఇప్పటికి వరకు ప్రభుత్వం నుండి ఎలాంటి సహాయం అందలేదని... ట్రై సైకిల్ తో పాటు రేషన్ కార్డు ఇప్పించి ప్రభుత్వ పరంగా ఆదుకోవాలని వేడుకుంటున్నాడు. దాతలు కూడా సహాయం చేయాలనీ కోరుతున్నాడు.

# భారత్ వికాస్ జనరిక్ మెడికల్ నూతన షాపు ప్రారంభం

- మేడ్చల్ పురపాలక సంఘం బీజేపీ అధ్యక్షురాలు జల్లి శైలజహరినాథ్ - ప్రజలకు తక్కువ ఖర్చుతో ఔషధాలను అందించాలనే ప్రధాన లక్ష్యం
- జనరిక్ మందుల వల్ల ప్రజలకు ఆర్థిక భారాన్ని తగ్గిస్తాయి
- లాభాలను వికలాంగులకు, త్రాగునీటి సౌకర్యాల కల్పనకు, ఆడపిల్లల సంక్షేమానికి, పేద విద్యార్థుల విద్యా సహాయానికి ఉపయోగిస్తాం : ట్రస్ట్ చైర్మన్ అశ్విని సుబ్బారావు



**మేడ్చల్ (ప్రశ్న న్యూస్)** మేడ్చల్ పురపాలక సంఘం పరిధిలోని రాఘవేంద్ర కాలనీలో నూతనంగా భారత్ వికాస్ జనరిక్ మెడికల్ షాపును భారత్ వికాస్ పరిషత్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ అశ్విని సుబ్బారావు ఆధ్వర్యంలో మేడ్చల్ పురపాలక సంఘం బీజేపీ అధ్యక్షురాలు జల్లి శైలజ హరినాథ్ ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ జనరిక్ మందులు నాణ్యతలో బ్రాండెడ్ మందుల కంటే ఏమాత్రం తీసిపోవని స్పష్టం చేశారు. ఈ మందుల ధరలు 30% నుండి 80% వరకు తక్కువగా ఉంటాయని, ఇది ప్రజలకు మందుల ఖర్చులను గణనీయంగా తగ్గించడంలో సహాయపడుతుందని ఆమె అన్నారు. జనరిక్ మందులు ప్రజలకు ఆర్థిక భారాన్ని తగ్గిస్తాయి. పేద, మధ్యతరగతి ప్రజలకు ఇవి ఒక వరం అని ఆమె అభిప్రాయం వ్యక్తం చేశారు. అనంతరం భారత్ వికాస్ పరిషత్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ అశ్విని సుబ్బారావు మాట్లాడుతూ ఈ భారత్ వికాస్ జనరిక్ మెడికల్ షాపు కేవలం వాణిజ్యపరమైనది మాత్రమే కాదని, దీని వెనుక ఒక గొప్ప సామాజిక బాధ్యత సైతం ఉందని వెల్లడించారు. ఈ షాపు ద్వారా వచ్చే లాభాలను సంఘ సేవ కార్యక్రమాల కోసం వినియోగించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ముఖ్యంగా వికలాంగులకు, త్రాగునీటి సౌకర్యాల కల్పనకు, ఆడపిల్లల సంక్షేమానికి, పేద విద్యార్థుల విద్యా సహాయానికి ఈ నిధులను ఉపయోగించడం జరుగుతుందని తెలిపారు. ఇలాంటి షాపులు మరిన్ని ప్రజలకు అందుబాటులోకి రావాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో భారత్ వికాస్ పరిషత్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ బచ్చు సుబ్బారావు , ట్రస్ట్ రాష్ట్ర పూర్వ అధ్యక్షుడు ఓం ప్రకాష్, ట్రస్ట్ సభ్యులు జలవేందర్, డాక్టర్ సుబ్బారావు, జనహిత ట్రస్ట్ మెంబర్ శ్రీదేవి, వ్యాపారవేత్త జనార్ధన్ మేడ్చల్ మాజీ సర్పంచ్ తాళ్ళపల్లి మురళీధర్ గుప్త, ఎల్లంపేట్ పురపాలక సంఘం బీజేపీ అధ్యక్షులు శ్రీశైలం యాదవ్, మేడ్చల్ పురపాలక సంఘం బీజేపీ ప్రధాన కార్యదర్శులు కానుకంటి వంశీ విజయ్ వంజరి, ప్రేమదాస్, మేడ్చల్ మున్సిపాలిటీ పురపాలక సంఘం బీజేపీ ఉపాధ్యక్షులు మైసరి రాజు వంజరి, లవంగ శ్రీకాంత్, జాకట బాబురాజు, జాకట బాలకృష్ణ, బొజ్జ వంశీ రెడ్డి, కవిరాజు, జె. నర్సింగ్, పుష్ప మల్లారెడ్డి, కానుకంటి భరత్ వంజరి, కేశవ రెడ్డి, మామిళ్ళ నర్సింగ్ రావు, చీర్ల సత్యనారాయణ, పతంజలి కిషోర్, ప్రవీణ తదితరులు పాల్గొన్నారు.

## మృతురాలి కుటుంబానికి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ పరామర్శ..! ప్రగాఢ సంతాపం..!!



**బోయినిపల్లి,(ప్రశ్న న్యూస్)** బోయినిపల్లిమండలం,దేశాయి పల్లి గ్రామానికి చెందిన పొన్నాల లచ్చయ్య భార్య పొన్నాల కనుకవ్వ గుండెపోటు తో శనివారం మృతి చెందిన నేపథ్యంలో ఆదివారం చొప్పదండి నియోజకవర్గం మాజీ శాసనసభ్యులు సుంకె రవిశంకర్ మృతురాలి కుటుంబ సభ్యులను కలిసి పరామర్శించి,వారి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని, నివాళులర్పించి, ప్రగాఢ సానుభూతిని తెలిపారు. వారి వెంట బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు కత్తెరపాక కొండయ్య,ప్రధాన కార్యదర్శి గుంటి శంకర్, రైతు సంఘం అధ్యక్షులు నిమ్మ శ్రీనివాసరెడ్డి, బీసీ సంఘం అధ్యక్షులు గురజాల కోటి,నాయకులు కత్తెరపాక పరశురాములు, తదితరులు ఉన్నారు.

# ఎండోమెంట్లో ఏం జరుగుతోంది.?

- ట్రిబ్యునల్ లో కేసు ఉంటే చెక్ ఎలా జారీ చేస్తారు
- దేవాదాయ శాఖలో అధికారుల బాధ్యతారహిత్యం: కుమ్మరి ఆంజనేయులు
- ఫిర్యాదులు చేసిన పట్టించుకోకుండా అవినీతిని ప్రోత్సహిస్తున్న అధికారులు
- ఉన్నత అధికారులకు ఫిర్యాదు చేసిన పట్టించుకోకపోతే సమస్య ఎలా తీరుస్తారు



**తార్నాక (ప్రశ్న న్యూస్)** లాలాపేట రహదారిపై ఉన్న శ్రీ నల్ల పోచమ్మ దేవాలయాన్ని దేవాదాయ శాఖ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని కుమ్మరి ఆంజనేయులు ఆరోపించారు. ఎండోమెంట్ శాఖ పరిధిలో ట్రిబ్యునల్ నందు ఈ ఆలయం పై కేసు నడుస్తున్న సందర్భంగా ఎండోమెంట్ అధికారులు బోనాల పండుగకు ఇచ్చే చెక్కును ఏ పద్ధతిపై జారీ చేస్తున్నారని ప్రశ్నించారు. కుటుంబంలో ఉన్న అందరు సభ్యులు నిర్వహించుకునే విధంగా అనుమతి ఇవ్వకుండా కేవలం ఒక వ్యక్తి నిర్వహించే విధంగా అధికారులు వత్తాసు పలకడం విడ్డూరంగా ఉందన్నారు. ఒక వ్యక్తి స్వార్థం కోసం దేవాలయాన్ని ఇలా చేయడం పై ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బోనాల ఖర్చులకోసం ఇస్తున్న ఒక లక్ష 25 వేల చెక్కు దుర్వినియోగం అవుతుందని చాలావరకు ఈ దేవాలయ అభివృద్ధికి భక్తులు దాతలు లక్షలలో డబ్బులు ఇస్తారని కానీ అందులో పాగా వేసుకొని కూర్చున్న ఒక వ్యక్తికి ఇలా చెక్కు ఇవ్వకూడదని ఆయన డిమాండ్ చేశారు. ఎండోమెంట్ అధికారులు అక్రమాలకు పాల్పడుతూ దేవాలయాలలో వాస్తవాలను తెలుసుకోకుండా చెక్కులు ఇవ్వడం విడ్డూరంగా ఉందన్నారు. ఏది ఏమైనా దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ ఇతర అధికారులు ఆలయాల నిర్వహణలో బాధ్యతారాహిత్యానికి అవినీతి అక్రమాలకు పాల్పడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

# బరితెగిస్తున్న బిఆర్ఎస్ నాయకులు

- ప్రశ్నిస్తే తట్టుకోలేక దాడులు
- తీన్మార్ మల్లన్న ఆఫీస్ పై దాడిని ఖండించిన కుమ్మరి ఆంజనేయులు



**తార్నాక (ప్రశ్న న్యూస్)** అధికారం కోల్పోయిన ఫ్రస్టేషన్లో ఉన్న బిఆర్ఎస్ నాయకులు తమ అవినీతి లీలలు బయటపడతా ఉంటే తట్టుకోలేక ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని సామాజిక కార్యకర్త కుమ్మరి ఆంజనేయులు పేర్కొన్నారు. ప్రజల్లో కోల్పోయిన విశ్వాసాన్ని తట్టుకోలేక వాటిని పక్కదో పట్టడం కొరకు ప్రజల్ని దృష్టి మళ్లించడం కొరకు రోజు ఒక రూపంలో కొత్త కొత్త వీధి పంచాయతీలు సృష్టిస్తున్నారు. నాడు అధికారం అడ్డం పెట్టుకొని ప్రజాసంఘాలను పౌర సంఘాలను మీడియాలను కట్టడి చేసిన అహంభావంతోటే నేడు వరుసగా మీడియా సంస్థలపై దాడులు చేస్తున్నారు. మీడియా మితిమీరిన వివరాలు చేసిన లేకపోతే తమ పరువుకు భంగం కలిగించిన చట్టపరమైన చర్యలు తీసుకోవాలే తప్ప సంస్థల మీద దాడులు చేయడము వ్యక్తులను నిర్మూలించే ప్రయత్నం చేయడం సరైంది కాదన్నారు. కవిత గుండాలు నిరసన పేరుతో తీన్మార్ మల్లన్న క్యూ న్యూస్ కార్యాలయం పై చేసిన దాడిని ప్రజలు ప్రజాస్వామ్య వాళ్ళందరూ ఖండించాలని కుమ్మరి ఆంజనేయులు కోరారు. అధికారంలో ఉన్నప్పుడు తీన్మార్ మల్లన్న పై దాడులు అధికారం కోల్పోయిన తర్వాత కూడా గుండాలతో దాడులు చేయించడం చూస్తుంటే తెలంగాణ జాగృతి బిఆర్ఎస్ పార్టీ గుండాల పార్టీగా మారిందని వాళ్ళు చేసేది రాష్ట్రంలో రాజకీయం కాదని గూండా ఇజం అని పదేళ్ల పాలనలో తెలంగాణ రాష్ట్రాన్ని దోచుకు తిన్నది సరిపోదు అన్నట్లుగా వాళ్ల వ్యవహారంపై ప్రజలు టిఆర్ఎస్ పార్టీని తెలంగాణ జాగృతిని కనుమరుగు చేయాలని ఈ సందర్భంగా కుమ్మరి ఆంజనేయులు పిలుపునిచ్చారు.

## ముద్దం నీతో బంధం విడదీయరానిదీ:గోపాల్



కంటోన్మెంట్ (ప్రశ్న న్యూస్) కూకట్పల్లి నియోజకవర్గం ఓల్డ్ బోయిన్ పల్లిలో డివిజన్ కార్పొరేటర్ ముద్దం నర్సింహా యాదవ్ ని సన్మానించిన “మానస సరోవర్ కాలనీ వాసులు. నిన్న ఆదివారం ఉదయం మానస సరోవర్ ఎంహెచ్:2,ఎంహెచ్:3 కాలనీ అసోసియేషన్ వాసులు. అధ్యక్షుడు గోపాల్ మలయాత్ర మాట్లాడుతూ తాను మానస సరోవర్ అపార్ట్మెంట్ లో గత ఒకటిన్నర దశాబ్ద కాలంగా ఉంటున్నానని,ఎప్పుడూ వర్ష కాలం వస్తే చాలు ఎగువన కురుస్తున్న వర్షాలకు దిగువన ఉన్న మానస సరోవరం పరిసర ప్రాంతాలు సంద్రాన్ని కల్పిస్తూ,ఆ భారీ వర్షాలు కారణంగా దిగువన ఉన్న మా వైపు వర్షం నీరు వస్తుంటే కొండల్లో కొణల్లో నుంచి వచ్చే జలపాతాలు,సరస్సులను తలపించేవి. అంతంటి భయంకర వాతావరణంలో బిక్కు బిక్కు మని గడిపిన రోజులు గుర్తు వస్తే చాలు మనస్సు ఒక్కసారి వళ్ళు పులకరిస్తుందని అసోసియేషన్



అధ్యక్షుడు గోపాల్ మలయాత్ర సమావేశంలో తన అనుభవాలను కమిటీ సభ్యులు అలాగే స్థానిక కార్పొరేటర్ ముద్దం నర్సింహా యాదవ్ తో పంచుకున్నారు. కానీ దశాబ్ది కాలంలో ఆయన మూడు పర్యాయాలు గెలుపులో ఆయన సాహసోపేతమైన నిర్ణయాలు తీసుకోవడం వాటిని అమలు చేయడం నిజంగా ఆయనకి ఆయన్నే సాటి. ఉదాహరణకు కూకట్పల్లి నియోజకవర్గం ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు కి వర్ష కాలంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల్ని దానికి ముఖ్యంగా మానస సరోవరం వాసుల ఇబ్బందులు పదే పదే ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లడం,ఆయన అప్పటి మల్కాజిగిరి ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతు రావు తో చర్చించి సుమారు “18”కోట్లు ఖర్చుపెట్టి నాలా విస్థిర్ణం పెంచి స్థానికులు గాలి పీల్చుకునేలా చేయడానికి కారణం కేవలం స్థానిక కార్పొరేటర్ ముద్దం నర్సింహా యాదవ్. అందుకే ఆయనతో “మా బంధం విడదీయరానిదీ “ అలాగే చిన్న చిటిక సమస్యలు సహజమే, ఇప్పుడు కూడా పలువురు స్థానికంగా పలు మౌళిక సమస్యలు తలెత్తుతున్నాయి అని ఆయన దృష్టికి తీసుకురావడంతో ఆయన వేంటనే స్పందించి వేంటనే సమస్యలు అన్ని పరిష్కరిస్తాను అనడం నిజంగా ఆయన గొప్ప తనం. అందుకే స్థానికంగా కొంతమందికి ముద్దంతో బంధం విడదీయరానిదీగా మారిపోయింది అని మరో సారి గోపాల్ స్పష్టం చేశారు. ఏదేమైనా స్థానిక కార్పొరేటర్ ముద్దం నర్సింహా యాదవ్ కి మరోసారి మానస సరోవర్ ఎంహెచ్ 2, ఎంహెచ్ 3 తరపున మీరు గతంలో నాలా సమస్య, ప్రధాన రోడ్ల సమస్యలు పరిష్కరించినందుకు మా చిన్న సన్మానం అంటూ ఆయనను గౌరవించారు. ముద్దం వివరణ: ఓల్డ్ బోయిన్ పల్లి డివిజన్ కార్పొరేటర్ ముద్దం నర్సింహా యాదవ్ మాట్లాడుతూ ఎంహెచ్:2, ఎంహెచ్:3 కాలనీ వాసులకి నా ప్రత్యేక ధన్యవాదాలను తెలియజేశారు. అలాగే ఆయన మాట్లాడుతూ ముఖ్యంగా నేను స్థానిక పౌరున్ని,నా చిన్న నాటి నుంచి భౌతికంగా ఈ పరిసరాలు నాకు వెన్నోతో పెట్టిన విద్య. ఆ నేపథ్యంలోనే స్థానిక డివిజన్ పరిధిలో ఉన్న ప్రజలు నన్ను ఎంతగానో ఆదరిస్తారు,అలాగే మూడు పర్యాయాలు గెలుపు అంత ఆషామాషీ వ్యవహారం కాదు! ఇప్పటికీ నాతో పలువురు చర్చిస్తారు. ఏమైనా నీ దగ్గర అయస్కాంత ఉందా ప్రజలు పదే పదే నిన్ను తెలుస్తుంటారు అని అడుగుతున్నారు. నేనోక్కటే సమాధానం చెబుతాను ఉదయం లెచెటప్పుడు అందరు హల్లారం పెట్టుకుంటారు. కానీ నేను నా డివిజన్ పరిధిలో ఉన్న ప్రజలు సమస్య చిన్నదా పెద్దదా ఆలోచించ కుండా ఫోన్ చేసి వారి బాధ వ్యక్త పరిచే లోపు సమస్య పరిష్కారం అయిపోతుంది. అందుకే నిత్యం నేను ప్రజల మధ్యలో ఉంటూ వారి బాగోగులు చూసుకుంటూ దినం గడిపెస్తాను. వాస్తవానికి మానస సరోవర్ ఎంహెచ్:2, ఎంహెచ్:3లో ఉన్న నా కుటుంబ సభ్యులు “ముద్దం నీతో మా బంధం విడదీయరానిదీ”అని అంటుంటే సరిపోదా నా శ్రమకి. అలాగే కొంతమంది చిన్న చిన్న సమస్యలు నా దృష్టికి తీసుకువచ్చారు. వాటిని వీలైనంత త్వరగా పూర్తి చేస్తానని ముద్దం నర్సింహా యాదవ్ వారికి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంహెచ్:3 అధ్యక్షుడు గోపాల్ మలయాత్ర, వైస్ ప్రెసిడెంట్ నిరంజన్ మిశ్రా,గిల్లియన్ విన్సెంట్, ప్రియాంక యాదవ్, అమిత్ అగర్వాల్,ఆశుగుప్తా, అజయ్,ఉమా,జయదేవ్, ఎంహెచ్:2 బీజయ సారంగి సెక్ తదితరులు పాల్గొన్నారు.

## కోట శ్రీనివాసరావు మృతి చిత్ర పరిశ్రమకు తీరని లోటు

- ప్రభుత్వ విప్ : ఆది శ్రీనివాస్



**వేములవాడ,(ప్రశ్న న్యూస్)** ప్రముఖ తెలుగు సినీ నటుడు కోట శ్రీనివాసరావు మృతి పట్ల రాష్ట్ర ప్రభుత్వ విప్,వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. వైవిధ్యభరితమైన పాత్రలతో ప్రేక్షకులను మెప్పించిన కోటా 750కి పైగా సినిమాల్లో నటించి,నాలుగు దశాబ్దాలకు పైగా సినీ,నాటక రంగాల్లో అమూల్య సేవలు అందించారని గుర్తు చేశారు. విలక్షణ నటనతో కోట్లాది ప్రేక్షకుల మనసులను గెలుచుకున్న కోట మృతి చిత్ర పరిశ్రమకు తీరని లోటని పేర్కొన్నారు. ఆయన పోషించిన పాత్రలు చిరస్మరణీయమని కొనియాడారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.



# అధికారిపై అవినీతి ఆరోపణలు

- కొన్నేళ్లుగా మంథనిలో పాతుకుపోయిన సదరు అధికారి
- ఏసీబీ నిఘా పెట్టి అధికారి అవినీతి బయటకు తీయాలని స్థానికుల విన్నపాలు
- కమిషన్ లు ఇస్తేనే పని చేస్తారు లేకుంటే లేదా.?
- పోన్ చెస్తే.. లిఫ్ట్ చేయడు.. సమాధానం ఇవ్వడు
- అవినీతి అధికారుల భరతం పట్టాలని ప్రజలు కోరిక

**మంథని (ప్రశ్న న్యూస్)** రాష్ట్రంలో ప్రతి రోజు ఎక్కడో ఒక్కచోట అవినీతి అధికారులు పట్టు బడుతుండడం చూస్తున్నాము .ప్రభుత్వం వేల రూపాయల నుండి లక్షల వరకు జీతాన్ని ఇస్తున్న కూడా కొందరు అధికారుల తీరు ఏమాత్రం మారడం లేదు.రోజు రోజుకు లక్షలు, కోట్ల అక్రమ సంపాదనే ధ్యేయంగా పని చేస్తున్నారు. దీనికి కారణం బాధితుల నుండి డబ్బులు తీసుకుంటూ దొరికిపోవడమే ఇందుకు కారణం. మంథనిలో ఓ శాఖకు చెందిన ఓ అధికారి పై తీవ్ర అవినీతి ఆరోపణలు వినిపిస్తున్నాయి. కొన్నేళ్లుగా మంథనిలో పాతుకుపోయినట్లుగా విమర్శలు వినిపిస్తున్నాయి. భారీగా అవినీతి అక్రమాలకు పాల్పడుతూ సదరు అధికారి లక్షల నుండి కోట్లకు పడగలెత్తినట్టుగా ఆరోపణలు బహిరంగంగానే వినిపిస్తున్నాయి. అవినీతి అధికారులు పై ఏసీబీ అధికారులకు కొందరు పిర్యాదు చేసినట్టు విశ్వనియ సమాచారం. ఏసీబీ నిఘా పెట్టి అధికారి అవినీతిని బయటకు తీయాలని పిర్యాదులు కూడా వెళ్లినట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి. సదరు అధికారి పోన్ చెస్తే, అసలు లిఫ్ట్ చేయడనీ జవాబు ఇవ్వడనీ స్థానికంగా భారీగా విమర్శలు వినిపిస్తున్నాయి. వేల నుండి లక్షల్లో ప్రభుత్వం మంచి వేతనాలు ఇస్తున్న కూడా కొందరు అధికారులు మాత్రం లంచాలకు అలవాటు పడుతున్నారు. ఇటీవల రాష్ట్రంలో భారీగా అవినీతి అదికారులు ఏసీబీకి పట్టుబడడం ఆస్తుల లెక్కలు తీస్తే కోట్లల్లో ఉండడం రాష్టంలో ప్రతి ఒక్కరికి ఆశ్చర్యనికి గురి చేసింది. ఇలా ఏసీబీకి రెడ్ హ్యాండెడ్ గా దొరకకుండా ఎంతోమంది అవినీతి అధికారులు రాజ్యమేలుతున్నారు. వీరికీ ప్రభుత్వం ఇచ్చే జీతం మీద ఆధారపకుండ తక్కువ సమయంలో ఎక్కువ డబ్బు సంపాదించడమే లక్ష్యంగా పని చేస్తున్నారు. మంథనిలో ఓ శాఖకు ఇంచార్జీ వ్యవహరిస్తూ ఇంతకు ముందు ఆరు ఏళ్లకు పైగా మంథనిలోనే పని చేయడం.ఇక్కడే పాతుకుపోవడంతో లొసుగులు మొత్తం తెలియడంతో చేతివాటం కాసులకు అలవాటు పడి రాజకీయ నాయకుల, ఉన్నత అధికారుల అండదండతో ఇక్కడే ఉంటున్నాడని విమర్శలు వినిపిస్తున్నాయి. అదే విధంగా అవినీతి ఏ శాఖల్లో ఎక్కువగా ఉందో అలాంటి శాఖల్లో ఏసీబీ నిఘా పెట్టి అవినీతి అక్రమ సొమ్మును వెలికి తీసి అలాంటి అధికారుల పై కఠిన చర్యలు తీసుకోనే అవసరం ఎంతగానో ఉందని మంథనిలో ప్రభుత్వ శాఖల్లో కొందరు అధికారులు చేతివాటం ప్రదర్శిస్తున్నట్టు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

ఒక్క సారి అవినీతితో పట్టుబడితే అక్రమ ఆస్తులను జప్తు చేసి ఉద్యోగం నుండి డిస్మిస్ చెస్తే బాగుంటుందని ఏసీబీలో దొరికిన తర్వాత కూడా తిరిగి రెండు సంవత్సరాలు లేదా ఇంకా తక్కువ సమయంలో ఉద్యోగం పొందడంతో అవినీతి అధికారులకు భయం లేకుండా పోయిందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మంథని నియోజకవర్గంలో ఏసీబీ అధికారులు ప్రత్యేక చొరవ తీసుకొని అవినీతి అధికారుల భరతం పట్టాలని ప్రజలు కోరుతున్నారు.

# సీఎంకి ఆహ్వానం పలికిన నేతికార్ సురేష్ లాల్



**హైదరాబాదు (ప్రశ్న న్యూస్)** తెలంగాణ రాష్ట్ర మంత్రి హైదరాబాద్ ఇంచార్జ్ మంత్రి పొన్నం ప్రభాకర్ మినిస్టర్ క్వార్టర్స్ నిర్వహించే బోనాల పండుగ కార్యక్రమానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హాజరైన సందర్భంగా తెలంగాణ ప్రభుత్వ ఆర్టిఏ సభ్యుడు సికింద్రాబాద్ నియోజకవర్గ ఏ బ్లాక్ అధ్యక్షుడు నేతికార్ సురేష్ లాల్ ఆయనకు ఆహ్వానం పలికారు.

# తీన్మార్ మల్లన్నపై దాడి ఖండిస్తున్నాం

## టీజేఎస్ఎస్

- తెలంగాణ జాగృతి అధ్యక్షులుగా బీసీ అభ్యర్థి పేరు ప్రకటించగలరా.?
- రాజకీయ లబ్ధి కోసమే బీసీ వాదం ఎత్తుకున్న కవిత
- బీఆర్ఎస్ పార్టీ ఇంటి పోరు పడలేకనే తెలంగాణ జాగృతి ఓవరాక్షన్
- అధికారంలో ఉన్నప్పుడు బీసీలు కనపడలేదా.? ఇప్పుడు ఉత్తిత్తి ప్రేమ ఎందుకు.?
- తీన్మార్ మల్లన్న సామెతలలో తప్పేముంది, సామెతలను కూడా తప్పుపట్టే సంస్కారం మీది
- అధికారంలో ఉన్న లేకున్నా బీఆర్ఎస్ చేస్తున్న దాడులు బీహార్ మూలాలకు కారణమా.?

**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్)** ప్రశ్నించే గొంతుకులను అణిచివేయాలని గత ప్రభుత్వంలో బీఆర్ఎస్ పార్టీ ఎంతోమంది జర్నలిస్టులపై తప్పుడు కేసులు పెట్టిందని, పది సంవత్సరాలు అధికారంలో ఉన్నప్పుడు జర్నలిస్టులు, బీసీ కుల సంఘాలు, బీసీ వాదం ఎక్కడా మాట్లాడని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఇప్పుడు బీసీ వాదంతో బీసీలకు న్యాయం చేస్తానని 42% బీసీ రిజర్వేషన్ అమలుకై పోరాడుతున్నానని కల్లబొల్లి మాటలు చెబుతూ తన రాజకీయ భవిష్యత్తును కాపాడుకుంటూ బీసీ వాదాన్ని ముందుకేసుకుని తన రాజకీయ లబ్ధి కోసం పరుగులు పెడుతుందని తెలంగాణ జర్నలిస్ట్ సంక్షేమ సంఘం నాయకులు పేర్కొన్నారు. తీన్మార్ మల్లన్న అనుచిత వ్యాఖ్యలు చేశారని తన గుండాలతో తీన్మార్ మల్లన్న క్యూ న్యూస్ ఆఫీస్ పై దాడి చేయడం అమానుషమని, మల్లన్న తప్పుగా మాట్లాడితే చట్టపరమైన చర్య తీసుకోవాలని ముఖ్యమంత్రికి శాసనమండలిలో, పోలీస్ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయాలి తప్ప తన అనుచరుల పేరుతో గుండాలను ఏర్పాటుచేసివి మల్లన్న పై దాడి చేపించడం అమానుషమని ఈ దాడిని టిజేఎస్ఎస్ తీవ్రంగా ఖండిస్తుందన్నారు.తెలంగాణ జాగృతి అధ్యక్షురాలుగా బీసీ బిడ్డను కల్వకుంట్ల కవిత ప్రకటిస్తుందా.? అని ఈ సందర్భంగా అన్నారు. బీసీ వాదాన్ని ముందుకు తీసుకెళుతున్న తీన్మార్ మల్లన్న కు బీసీల నుండి భారీగా మద్దతు వస్తుందని ఓర్వలేక కవిత చిల్లర రాజకీయాలు చేయడం జరుగుతుందన్నారు. బీసీలకు తెలంగాణ జాగృతిలో అధ్యక్ష స్థానాన్ని కల్పిస్తుందా.? తన రాజకీయ లబ్ధి కోసం బీఆర్ఎస్ పార్టీలో ఇంటి పోరు పడలేక బిఆర్ఎస్ నుండి అనధికారికంగా వెల్లగొట్టారని దానితో తెలంగాణ జాగృతి పేరుతో ప్రజలతో మమేకమై తన రాజకీయ భవిష్యత్తును కాపాడుకోవాలని చూస్తున్న కల్వకుంట్ల కవిత పది సంవత్సరాలు అధికారంలో ఉన్నప్పుడు బీసీలకు తమ ప్రభుత్వం ఏమి న్యాయం చేసిందని ఈ సందర్భంగా టీజేఎస్ఎస్ ప్రశ్నిస్తోంది. ప్రశ్నించే గొంతుకలను అనచివేయడం ఎవరి తరం కాదని, తప్పు చేసిన వారిని ప్రజలు తప్పకుండా శిక్షిస్తారని, దౌర్జన్యాలతో భయభ్రాంతులను చేసి అంచివేయాలని చూస్తే ఎవరు చూస్తూ ఊరుకోరని తప్పు ఎవరు చేసినా పార్టీలకు అతీతంగా టీజేఎస్ఎస్ ఖండిస్తదని ఈ సందర్భంగా అన్నారు.

బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు కల్వకుంట్ల చంద్రశేఖర రావు తెలంగాణ ఉద్యమ సమయంలో ఎస్సీ అభ్యర్థిని ముఖ్యమంత్రి చేస్తానని ప్రకటించి అధికారం చేపట్టాక బడుగు బలహీన వర్గాలను దూరం పెట్టలేదా అని ఈ సందర్భంగా అన్నారు. బీఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉన్నప్పుడు తీన్మార్ మల్లన్న కార్యాలయం పై దాడులు చేయడం అధికారం పోయిన తర్వాత కూడా దాడులు చేయడం చూస్తుంటే బీఆర్ఎస్ నేతలకు బీహార్ మూలాలు ఇంకా రక్తంలో ఉన్నాయా అన్నారు. అధికారంలో ఉన్నప్పుడు కనిపియ్యని మీ పార్టీ అధ్యక్షునికి ఎమ్మెల్సీ కవితకు ఇప్పుడు బీసీ బిడ్డలు కనిపించడం హాస్యాస్పదంగా ఉందన్నారు. దమ్ముంటే ముందుగా బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షునిగా బడుగు బలహీన వర్గాలను ప్రకటించమని ఈ సందర్భంగా టీజేఎస్ఎస్ తరపున డిమాండ్ చేస్తున్నామన్నారు. ఇకపై ప్రశ్నించే గొంతుకలు జర్నలిస్టులపై ఎవరు దాడి చేసిన తప్పుడు కేసులు పెట్టిన బడుగు బలహీన వర్గాల బిడ్డలు చూస్తూ ఊరుకోరని ఈ సందర్భంగా టీజేఎస్ఎస్ నేతలు తెలిపారు.

# రాజా సింగ్ ఫైర్ బ్రాండే ! అదే పెద్ద చిక్కు !!



**హైదరాబాద్ (ప్రశ్న న్యూస్):** తెలంగాణలో ఫైర్ బ్రాండ్ నేత గోషామహల్ ఎమ్మెల్యే రాజా సింగ్. ఈమధ్యే బీజేపీకి రిజైన్ చేశారు. ఆ పార్టీ అధిష్టానం ఆమోదం కూడా తెలిపింది. ఇలా ఒక పార్టీకి గుడ్ బై కొట్టిన లీడర్ ను మరో పార్టీ వెంటనే చేర్చుకుంటుంది. తెలంగాణ, ఏపీలోనే కాదు... దేశంలో ఎక్కడైనా ఇది కామన్. ఇక ఫైర్ బ్రాండ్ లీడర్లకైతే డిమాండ్ ఎక్కువే! కంగనా రనౌత్‌ను చూస్తే, ఆమె కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా మాట్లాడటంతో, బీజేపీలో చేర్చుకున్నారు. ఎంపీ సీటు కూడా సంపాదించారు. ఆమె కూడా ఫైర్ బ్రాండే. కానీ రాజా సింగ్ విషయంలో మాత్రం అలా జరగలేదు. ఏ పార్టీ కూడా ఆయన్ని ఆహ్వానించలేదు. దాంతో ఆయన రాజకీయ భవిష్యత్తు ఏంటి అనే ప్రశ్న తలెత్తుతోంది.

## రాజా సింగ్ స్పెషాలిటీ ఏంటి?

రాజా సింగ్ గురించి చెప్పాలంటే చాలా నిఖార్సయిన మనిషి. ఆయన వ్యక్తిగత జీవితంలో అవినీతికి అవకాశం లేదు. ఒక్క రూపాయి స్కామ్ కూడా కనిపించదు. ప్రభుత్వం ఇచ్చే జీతంతోనే జీవిస్తాడు. సొంత కారు కూడా లేదు. ఆయన పాలిటిక్స్ కూడా అంతే నిఖార్సుగా ఉంటాయి. హిందూత్వం గురించి మాట్లాడేటప్పుడు మాత్రం నిప్పులు కక్కేలా మాట్లాడతాడు. కాకపోతే ఇదే ఆయనకు పెద్ద చిక్కుగా మారింది!

## నిప్పులు కక్కితే చిక్కులు తప్పవా ?

రాజా సింగ్ మాటలు నిప్పులాంటివి. ఆయన హిందూత్వ ఎజెండా, మైనారిటీలపై చేసే వ్యాఖ్యలు చాలా సార్లు కాంట్రోవర్సీ అయ్యాయి. 2022లో, ఆయన ఒక మతం గురించి చేసిన కామెంట్స్ పై బీజేపీ పార్టీ నుంచి సస్పెండ్ చేసింది. తర్వాత మళ్లీ తీసుకున్నా, ఆయన స్టైల్ మాత్రం మారలేదు. ఈ ముక్కుసూటి తనం, హిందూత్వ ముద్ర ఇతర పార్టీలకు సుతరామూ నచ్చట్లేదు. రెండు తెలుగు రాష్ట్రాల బీజేపీలో రాజా సింగ్‌లాగా నిప్పులు కక్కే లీడర్ లేదు. రాజా సింగ్ బీజేపీ నుంచి బయటకొచ్చాక, ఏ పార్టీ ఆయన్ను చేర్చుకునేందుకు సిద్ధంగా లేదని తెలుస్తోంది. ఆయన స్టైల్ చాలా పార్టీలకు రిస్క్‌గా కనిపిస్తోంది. ఇలాంటి నేతను చేర్చుకుంటే, మైనారిటీ ఓట్లు పడవని పార్టీలు భయపడుతున్నాయి. కాంగ్రెస్, బీఆర్ఎస్ లాంటి పార్టీలు రాజా సింగ్‌ను టచ్ చేసేందుకు ఆసక్తి చూపట్లేదు. కానీ రాజకీయంగా చూస్తే, పార్టీలు అవసరమైనప్పుడు మైనారిటీలను సపోర్ట్ చేస్తాయి. ఉదాహరణకు, బీజేపీ ఎంఐఎం ఎంపీ అసదుద్దీన్ ఒవైసీని, ఆపరేషన్ సింధూర్ తర్వాత విదేశాలకు పంపింది. కానీ, రాజా సింగ్ రాజకీయం అలాంటి ఫ్లెక్సిబిలిటీ లేనిది. ఆయన హిందూత్వ ఎజెండాకు కట్టుబడి, ఎవరినీ లెక్కచేయకుండా స్ట్రెయిట్‌గా మాట్లాడతాడు. ఇదే ఆయనకు ప్లస్ అయినా, రాజకీయంగా మైనస్‌గా మారింది. అందుకే రాజాసింగ్ శివసేన వైపు ఇంట్రెస్ట్ చూపిస్తున్నట్టు తెలుస్తోంది. ఉద్దవ్ థాకరే వర్గంతో ఇప్పటికే సంప్రదింపులు కూడా చేసినట్టు చెబుతున్నారు. కరుడు గట్టి హిందూత్వ వాదిగా ఆయనకు ఆ పార్టీయే కరెక్ట్ అంటున్నారు విశ్లేషకులు.

# మేడ్చల్‌లో డూప్లికేట్ మాల్



- నాణ్యతలేని స్పేర్ పార్ట్స్ విక్రయం
- ఎస్టిమేషన్లతోనే ఇష్టారాజ్యంగా వ్యాపారం
- పలు ఆటోమొబైల్ షాపుల్లో నిలువు దోపిడీ
- కొన్ని చోట్ల బిల్లులు ఉండవు... అంతా జీరో దందానే

"మండలంలోని కొన్ని ద్విచక్ర వాహనాల సర్వీస్ సెంటర్లు నాణ్యత లేని వస్తువులను వినియోగదారులకు అంటగడుతూ... కస్టమర్లను నిలువునా మోసం చేస్తున్నారు. వారి దందాకు అడ్డూ అదుపు లేకుండా పోయింది. వీరు వేసిన వస్తువే ఒరిజినల్, చెప్పిన ధరనే ఫైనల్ అనేలా వ్యవహరిస్తున్నారు. వీరి దగ్గర బేరసారాలు అనే ప్రసక్తే ఉండదు. క్వాలిటీ సరుకు కావాలంటే ధరలు ఇంతే ఉంటాయని, ఇష్టం ఉంటే కొనండి లేదంటే పక్కకు వెళ్లి డూప్లికేట్ సామాన్లు కొనుక్కోండి అంటూ కస్టమర్లను తెలివిగా బోల్తా కొట్టించడంలో ఆరి తేరారు. ఈ వ్యాపారులకు బిల్లులతో పనిలేదు, ప్రభుత్వ పన్నులు అంటే పట్టింపు ఉండదు"



**మేడ్చల్ (ప్రశ్న న్యూస్)** నిత్యం బతుకుతెరువు కోసం ఉపయోగించే ద్విచక్ర వాహనాలే వీరికి ఆదాయ వనరుగా మారింది. కూరగాయలు అమ్మే వ్యాపారి నుంచి, ఆఫీసులకు వెళ్లే ఉద్యోగుల వరకు ప్రతి ఒక్కరూ ద్విచక్ర వాహనాలపై ఆధారపడే తప్పని పరిస్థితి నెలకొంది. నిత్యం ద్విచక్ర వాహనాలు వాడే వాహనదారులకు చిన్న రిపేర్లు, పెద్ద రిపేర్లు, వాహనానికి డ్యామేజీలు తప్పక తారస పడతాయి. వీటిని అదునుగా చేసుకున్న కొంతమంది పేరొందిన ఆటో మొబైల్ వ్యాపారులు నాణ్యత లేని వస్తువులను అంటగట్టి కోట్లు గడిస్తున్నారు. మండలంలో ఈ దందాకు అడ్డు అదుపు లేకుండా పోయింది. వీరు వేసిన వస్తువే ఒరిజినల్, వీరు చెప్పిన రేటే ఫైనల్.

## నాణ్యత లేని స్పేర్ పార్ట్స్..

ప్రస్తుత పోటీ ప్రపంచంలో వ్యాపారం జరగాలన్న, ఉద్యోగానికి సకాలంలో చేరుకోవాలన్నా ద్విచక్ర వాహనం తప్పనిసరిగా మారింది. ఇందులో భాగంగా వాహనం మొరాయిస్తే షెడ్డుకు వెళ్లక తప్పదు. ఇదే అదునుగా చేసుకున్న మండలంలోని కొంతమంది ఆటో మొబైల్ వ్యాపారులు, నాణ్యతలేని స్పేర్ పార్టులను ఒరిజినల్ కంపెనీల పేర్లతో అమ్మకాలు జరిపి అందినంత దోచుకుంటున్నారు. వీరి దగ్గర బేరసారాలు అన్న ప్రసక్తే ఉండదు. క్వాలిటీ సరుకు కావాలంటే ధరలు ఇంతే ఉంటాయి. ఇష్టం ఉంటే కొనండి లేదంటే పక్కకు వెళ్లి డూప్లికేట్ సామాన్లు కొనుక్కోండి అని కస్టమర్లను తెలివిగా ఆకట్టుకోవడంలో వీరు సిద్ధహస్తులు. ఈ వ్యవహారం అంతా తెలియని వినియోగదారులు వాడే సామాన్లు నాలుగు కాలాల పాటు ఉంటుందని వారు చెప్పినంత ధరలకు కొనుగోలు చేసిన కొంతకాలానికె పప్పులో కాలేశామని అర్థమయి ఆందోళన చెందుతున్నారు.

## ఇష్టారాజ్యంగా వ్యాపారం..

అందినంత అడ్డంగా దోచుకుంటున్న ఈ ఆటోమొబైల్ వ్యాపారులకు బిల్లులతో పనిలేదు, ప్రభుత్వ పన్నులు అంటే పట్టింపు లేదు. చిన్న స్క్రూను మొదలు పెద్ద స్పేర్ పార్ట్ వరకు అంతా జీరో దందానే. ఇక కస్టమర్ల వ్యవహారానికి వస్తే ఆటోమొబైల్ షాపు ఎదురుగా షెడ్డులో ఉన్న బండి స్టార్ట్ అయిందా లేదా అన్నట్లు వారు అడిగినంత ముట్ట చెప్పి వెళ్లిపోయిన అనంతరం అసలు విషయం గ్రహిస్తారు. బిల్లులు ఎవరు అడగరు పొరపాటున ఎవరైనా అడిగినా ఒక కాగితాల మీద బిల్లులు రాసిచ్చి మమా అనిపిస్తున్నారు. వీరి దందాకు అడ్డుకట్ట వేయాల్సిన సంబంధిత శాఖ అధికారులు మాత్రం నిద్రమత్తులో ఉన్నారని విమర్శలు జోరుగానే వినిపిస్తున్నాయి. ఇలా జీరో వ్యాపారం చేయడంతో పాటు నాణ్యతలేని సరుకులను ప్రజలకు అంటగట్టి కోట్లు గడిస్తున్న ఇటువంటి వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకోవాలని ద్విచక్ర వాహనాలదారులు డిమాండ్ చేస్తున్నారు.

Printed, Published & Owned by "Gouti Bala Sai Tilak" and Published at H.No : 8-2-293/82/10/80, Womens Co-operative Housing Society, Road No - 7, Jubilee Hills, Hyderabad - 500033, Telangana State. Printed at "Gowrish Offset Printers". H.No : 3-4-353, Barkatpura, Hyderabad-500027. Telangana State. Editor : "Vempati Vijay Kumar". "RNI No: TELTEL/2021/80267". Email : prajaprashna@gmail.com. Cell No : 9494055588